మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

శుక్రవారం FRIDAY 8-5-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 309 Issue: 309

08 మే 2026 - శుక్రవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - వసంత ఋతువు వైశాఖ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - తె. 5:50 సూర్యాస్తమయం - సా. 6:34 తిథి షష్ఠి మ. 12:19 వరకు తరువాత సప్తమి సంస్కృత వారం భృగు వాసరః నక్షత్రం ఉత్తరాషాఢ రా. 9:09 వరకు తరువాత శ్రవణ యోగం శుభ రా. 2:20o వరకు కరణం వనిజ మ. 12:19 వరకు విష్టి రా. 1:14o వరకు వర్జ్యం రా. 1:40 నుండి తె. 3:24 వరకు దుర్ముహూర్తం ఉ. 8:23 నుండి ఉ. 9:14 వరకు మ. 12:38 నుండి మ. 1:29 వరకు రాహుకాలం ఉ. 10:37 నుండి మ. 12:12 వరకు యమగండం మ. 3:23 నుండి సా. 4:59 వరకు గుళికాకాలం ఉ. 7:26 నుండి ఉ. 9:01 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:14 నుండి తె. 5:02 వరకు అమృత ఘడియలు మ. 2:13 నుండి సా. 4:00 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:47 నుండి మ. 12:38 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

Circulated to Telangana
Published from Jagitial



## మమత సర్కార్ బర్తరఫ్

### బెంగాల్ అసెంబ్లీ రద్దు.. గవర్నర్ కీలక నిర్ణయం

గవర్నర్ రవి బెంగాల్‌లో మమతా బెనర్జీ సర్కార్‌ను బర్తరఫ్ చేశారు. సీఎం పదవికి రాజీనామా చేయడానికి మమత బెనర్జీ ఒప్పుకోకపోవడంతో గవర్నర్ గురువారం ఈ నిర్ణయం తీసుకున్నారు. మమతా రాజీనామా చేయకపోవడంతో గడువు ముగిసిన వెంటనే బెంగాల్ అసెంబ్లీని రద్దు చేశారు.

కోల్‌కతా: అసెంబ్లీ ఎన్నికల్లో తామే గెలిచామని, రాజీనామా చేసే ప్రసక్తే లేదన్నారు మమత. ఎల్లుండి బెంగాల్‌లో తొలి బీజేపీ సర్కార్ కొలువు తీరుతుంది. ఉదయం 10 గంటలకు బ్రిగేడ్ గ్రౌండ్స్‌లో కొత్త సీఎం ప్రమాణం చేస్తారు. శుక్రవారం జరిగే బీజేపీ శాసనసభా పక్ష సమావేశంలో సీఎంను తరువాయి 2 వ పేజీలో...



## నోటి కాడి ముద్ద

### అకాల వర్షం దెబ్బ.. పంట పెంట కుప్ప

**20 రోజులుగా కొనని అధికారులు.. రోడ్డెక్కిన జగిత్యాల అన్నదాతలు**

**హుటాహుటిన రైతుల వద్దకు కలెక్టర్.. పంట మొత్తం కొంటామని హామీ**



చెమట చిందించి పండించిన పంట తడిసి ముద్దైంది..
కడుపు ఎండబెట్టుకొని పడ్డ కష్టం నీళ్ల పాలైంది..
కాయాకష్టం చేసి కల్లాలకు చేర్చితే కన్నీళ్లే మిగిలాయి..
అకాల వర్షం దెబ్బకు అన్నదాత కుదేలైండు!
కొనుగోలు కేంద్రాల్లోనే మక్కలు ముక్కిపోతున్నయ్!!

జగిత్యాల బ్యూరో, మే 7 (ఈవార్తలు): తెలంగాణలోని పలు జిల్లాల్లో గురువారం భారీ వర్షాలు కురిశాయి. అకాల వర్షం దెబ్బకు అనేక చోట్ల రైతుల పంటలు ఆగమైపోయాయి. జగిత్యాల జిల్లా కేంద్రంలోని బీట్ బజార్ వద్ద గంటపాటు కురిసిన భారీ వర్షంతో మక్కలు పూర్తిగా తడిసిముద్దయ్యాయి. దీంతో రైతులు ఆందోళన చేపట్టారు. 20 రోజుల క్రితం తీసుకొచ్చిన -2 వ పేజీలో...

## మోడల్ స్కూల్స్ ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల



రాష్ట్రంలోని మోడల్ స్కూళ్లలో 2026-27 విద్యా సంవత్సరానికి గాను నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ప్రవేశాల కోసం గత నెల ఏప్రిల్ 19వ తేదీన జరిగిన మోడల్ స్కూల్స్ అడ్మిషన్ టెస్ట్ మెరిట్ జాబితాను అధికారిక వెబ్ సైట్‌లో అందుబాటులో ఉంచారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

హైదరాబాద్, మే 7 (ఈవార్తలు): : పరీక్షకు హాజరైన విద్యార్థులు తమ మార్కులు, ర్యాంకులను తెలుసుకోవడానికి అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ ఏడాది మొత్తం 37,216 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, 30,545 మంది పరీక్షకు హాజరయ్యారు. కేవలం 6,671 మంది మాత్రమే పరీక్షకు గైర్హాజరయ్యారు. తరగతుల వారీగా హాజరైన -2 వ పేజీలో...

## విజయ్ బీస్ట్ మోడ్

**107 ఎమ్మెల్యేలతో రిజైన్ చేయిస్తా.. డీఎంకే, అన్నాడీఎంకేకు వార్నింగ్**



తమిళనాడు ముఖ్యమంత్రి పదవికి ప్రధాన పోటీదారుగా నిలిచిన టీవీకే అధినేత విజయ్ తాజాగా సంచలన ప్రకటన చేశారు. రాష్ట్రంలో డీఎంకే, అన్నాడీఎంకే కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే 107 మంది శాసనసభ్యులు రాజీనామా చేస్తారని ఈ మేరకు తమిళగ వెట్రి కజగం (టీవీకే) పార్టీ స్పష్టం చేసింది. డీఎంకే, అన్నాడీఎంకే నేతల మధ్య జరిగిన రెండు సమావేశాల అనంతరం ఈ నిర్ణయం వెలువడింది. టీవీకే మొత్తం 108 అసెంబ్లీ స్థానాలను గెలుచుకుంది. వాటిలో రెండింటిని విజయ్ సాధించారు. పార్టీకి 107 మంది ఎమ్మెల్యేలున్నారు.

చెన్నై: రాష్ట్రంలో అతిపెద్ద పార్టీగా తమకే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే తొలి అవకాశం ఇవ్వాలని టీవీకే డిమాండ్ చేస్తోంది. అయితే గవర్నర్ ఆర్వీ అర్లేకర్ విజయ్ ప్రయత్నాన్ని తిరస్కరించారు. మెజారిటీకి 118 మంది మద్దతు లేఖలు సమర్పించాలని ఆయన షరతు విధించారు. అత్యధిక స్థానాలు గెలిచిన తమను పక్కకు నెట్టి, డీఎంకే, అన్నాడీఎంకే కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు కుమ్మక్కయ్యాయని టీవీకే తీవ్రంగా అనుమానిస్తూ రాజీనామా హెచ్చరిక చేసింది. టీవీకే సంఖ్యాబలంపై గవర్నర్ వ్యక్తం చేసిన సందేహాలతో విజయ్ ప్రమాణస్వీకారం అనిశ్చితిలో తరువాయి 2 వ పేజీలో...

## మూడ్రోజులు వానలు

దూసుకొస్తున్న ద్రోణి

తగ్గనున్న ఉష్ణోగ్రతలు

### బంగారం-వెండి ధరలు



బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,300 |
| వెండి (కిలో): | రూ.2,75,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,291 |

### విశ్వవాణి



1986లో కోకాకోలా 70 వేల ఖాళీ బాటిళ్లతో అతి పెద్ద లోగోను చిలీలోని అటకామా ఎడారిలో రూపొందించారు. 40 ఏళ్లు గడిచినా ఇప్పటికీ ఆ లోగో అంతరిక్షం నుంచి కూడా బాగా కనిపిస్తోంది.





## డ్రగ్స్.. తంబాకు!

## బండి వర్సెస్ పాడి

**ఇరు వర్గాల మాటల యుద్ధం.. రణరంగంగా కరీంనగర్**

**ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌పై దాడి.. బీజేపీ నేతల పనే: బీఆర్ఎస్**

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రాజకీయ ఉద్రిక్తతలు ఒక్కసారిగా తారాస్థాయికి చేరాయి. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, బీఆర్ఎస్ నేతల మధ్య కొనసాగుతున్న మాటల యుద్ధం చివరకు దాడులు, నిరసనల దాకా వెళ్లింది. కేటీఆర్ డ్రగ్స్ తీసుకుంటున్నాడని, డ్రగ్స్ టెస్టుకు రావాలని బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపగా.. దీనికి హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఘాటుగా కౌంటర్ ఇచ్చారు.

కరీంనగర్, మే 7 (ఈవార్తలు): బండి సంజయ్ తంబాకులో డ్రగ్స్ తీసుకుంటున్నాడు.. ఆయనే ముందుగా టెస్టుకు రావాలి అంటూ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో మరింత మంటలు రాజేశాయి. కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలతో ఆగ్రహానికి గురైన బండి సంజయ్ అనుచరులు కరీంనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంపై దాడికి దిగినట్లు బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. క్యాంప్ -2 వ పేజీలో...



## 20లోగా డబుల్ లబ్ధిదారుల ఎంపిక

### మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడి


రాష్ట్రంలోని పేద ప్రజలకు గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి శుభవార్త వినిపించారు. మే 20వ తేదీలోగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. అలాగే అర్హులైన పేద ప్రజలను లబ్ధిదారులుగా ఎంపిక చేసేలా.. స్థానిక ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు.

హైదరాబాద్, మే 7 (ఈవార్తలు): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం గతంలో భూములను సేకరించిన సంగతి తెలిసిందే. ఆ భూములలో వినియోగించని వాటిని అర్హులైన పేదలకు అందించేలా.. వారికి ఇళ్ల పట్టాలు ఇచ్చేలా చర్యలు చేపట్టాలని మంత్రి పొంగులేటి కలెక్టర్లకు సూచించారు. హౌసింగ్, రెవెన్యూ అంశాలపై ఉమ్మడి మహబూబ్ నగర్. నల్గొండ జిల్లాల ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కలెక్టర్లతో పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని ప్రతి పేదవాడి సొంతింటి కలను నెరవేర్చటంతో పాటుగా.. నిజమైన భూమి యజమానులకు చట్టపరమైన హక్కులు కల్పించడమే తమ ప్రభుత్వ ప్రాధాన్యమని మంత్రి స్పష్టం చేశారు. జిల్లా తరువాయి 2 వ పేజీలో...

## కేటీఆర్‌పై క్రిమినల్ కేసు నమోదు

వరంగల్, మే 7 (ఈవార్తలు): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ మరోసారి చిక్కుల్లో పడ్డారు. బుధవారం హనుమకొండలో నిర్వహించిన 'రైతు సంగ్రామ సదస్సు'లో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి కేటీఆర్ చేసిన అనుచిత వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. దీంతో అత్యున్నత పదవుల్లో ఉన్న వ్యక్తులపై ఇష్టం వచ్చినట్లుగా నోరు పారేసుకున్నారంటూ చేశారంటూ వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, డీసీసీ అధ్యక్షుడు ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి, తదితరులు వరంగల్‌లోని సుబేదారి పోలీసులకు కేటీఆర్‌పై ఫిర్యాదు చేశారు. అనంతరం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరక సీఐ మేకల రంజిత్ కుమార్ కేటీఆర్‌పై బీఎన్ఎస్ యాక్ట్‌లోని 504, సెక్షన్ 505 కింద క్రిమినల్ కేసులు నమోదు చేశారు. రైతు సదస్సు వేదికగా కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు రెచ్చగొట్టేలా ఉన్నాయని, తద్వారా శాంతిభద్రతల సమస్య తలెత్తే అవకాశం ఉందని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు.





## అమెరికా-ఇరాన్ జల'సంధి'!

**ఇరుదేశాల మధ్య ఒప్పందం.. త్వరలోనే తెరుచుకోనున్న హార్మూజ్**

కొద్ది రోజులుగా మూసి ఉన్న హార్మూజ్ జలసంధి త్వరలోనే తెరుచుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ జలసంధి విషయంలో అమెరికా, ఇరాన్ మధ్య ఒప్పందం తుది దశకు చేరుకున్నట్లు తెలుస్తోంది. అంతర్జాతీయ సంస్థల అంచనా ప్రకారం.. హార్మూజ్ జలసంధి విషయంలో అమెరికా, ఇరాన్ మధ్య చర్చలు కొనసాగుతున్నాయి. ఈ అంశంపై గురువారం రెండు దేశాలు ఒక ఒప్పందానికి వచ్చినట్లు తెలుస్తోంది.

టెహ్రాన్: హార్మూజ్‌ను వీలైనంత త్వరగా, దశలవారీగా అందుబాటులోకి తేవాలని ఇరు దేశాలు నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఒకట్రెండు రోజుల్లోనే హార్మూజ్ విషయంలో పూర్తి ఒప్పందం కుదిరి, జలసంధి అందుబాటులోకి వచ్చే అవకాశం కనిపిస్తోంది. అలాగే, ఇక్కడ చిక్కుకుపోయిన నౌకల్ని కూడా ప్రయాణించేందుకు అనుమతివ్వనున్నారు. ఇరాన్, అమెరికా మధ్య యుద్ధం ప్రారంభమైన ఫిబ్రవరి 28 నుంచి హార్మూజ్ మూసి ఉన్న సంగతి తెలిసిందే. మధ్యలో కొన్ని గంటలు మాత్రమే హార్మూజ్‌ను ఇరాన్ ఓపెన్ చేసింది. ఆ తర్వాత వెంటనే తరువాయి 2 వ పేజీలో...

## వడ్డీ లేని రుణాలు 10 లక్షలు

**మహిళా సంఘాలకు గుడ్ న్యూస్: మంత్రి సీతక్క**



హైదరాబాద్, మే 7 (ఈవార్తలు): రాష్ట్రంలోని మహిళా సంఘాలకు తెలంగాణ ప్రభుత్వం గుడ్ న్యూస్ వినిపించింది. మహిళా సంఘాలకు ప్రభుత్వం అందిస్తున్న సున్నా వడ్డీ రుణాల పరిమితిని పెంచుతూ నిర్ణయం తీసుకుంది. మహిళా సంఘాలకు ప్రస్తుతం వడ్డీ లేని రుణాలను రూ. 5 లక్షల వరకూ అందిస్తున్నారు. అయితే ఈ మొత్తాన్ని తెలంగాణ-2 వ పేజీలో...

# రాశి ఫలాలు

8.5.2026

మేషం: సన్నిహితులతో తొందరపడి మాట్లాడటం మంచిది కాదు. చేపట్టిన పనులలో శ్రమాధిక్యత పెరుగుతుంది. ఆరోగ్య విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలి. ఆదాయం అంతంత మాత్రంగా ఉంటుంది. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. వ్యాపారాలు మందగిస్తాయి. ఉద్యోగాలలో చికాకులు అధికమవుతాయి.

వృషభం: చేపట్టిన పనులలో కార్యసిద్ధి కలుగుతుంది. ఇంటాబయట ఆశ్చర్యకరమైన సంఘటనలు చోటు చేసుకుంటాయి. ఆప్తుల నుండి విలువైన సమాచారం అందుతుంది. నిరుద్యోగులకు అధికారుల అండదండలు లభిస్తాయి. వ్యాపారాలు విస్తరిస్తారు. ఉద్యోగాలలో అంచనాలు అందుకుంటారు.

మిధునం: వృత్తి వ్యాపారాలలో సొంత ఆలోచనలు అమలు చేస్తారు. శత్రువులు కూడా మిత్రులుగా మారి సహాయ సహకారాలు అందిస్తారు. నూతన వ్యక్తులతో పరిచయాలు పెరుగుతాయి. గృహమున ఒక సంఘటన ఆకట్టుకుంటుంది. ఉద్యోగాలలో సమస్యలు తొలగి హోదాలు పెరుగుతాయి.

కర్కాటకం: ముఖ్యమైన పనులలో ఆటంకాలు తప్పవు. స్వల్ప అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. అవసరానికి చేతిలో డబ్బులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటారు. కుటుంబ సభ్యులతో మాటపట్టింపులు ఉంటాయి. ఉద్యోగాలలో స్థానచలన సూచనలు ఉన్నవి. వ్యాపారాలలో నిరుత్సాహ వాతావరణం తప్పదు.

సింహం: స్నేహితులు మీ మాటతో విబేదిస్తారు. కుటుంబ పెద్దల ఆరోగ్య విషయంలో శ్రద్ధ వహించాలి. ప్రయాణాలు వాయిదా పడతాయి. దూర ప్రయాణాలలో మార్గ అవరోధాలు కలుగుతాయి. ఆధ్యాత్మిక కార్యక్రమాలపై దృష్టి సారించడం మంచిది. ఉద్యోగాలలో అధికారులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది.

కన్య: ఆదాయం సంతృప్తికరంగా ఉంటుంది. ఇంటా బయట కొన్ని సమస్యలు సన్నిహితుల సాయంతో పరిష్కరించుకుంటారు. వ్యాపారాలలో అనుకున్న లాభాలు అందుకుంటారు. చేపట్టిన పనులు అనుకున్న సమయానికి పూర్తి చేయగలుగుతారు. సన్నిహితులతో వివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి. ఉద్యోగాల్లో పురోగతి సాధిస్తారు.

తుల: ఆదాయం మరింత నిరాశ కలిగిస్తుంది. చేపట్టిన వ్యవహారాల్లో చికాకులు తప్పవు. కొందరి ప్రవర్తన వలన శిరో బాధలు తప్పవు. వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. కుటుంబ వాతావరణం గందరగోళంగా ఉంటుంది. ఉద్యోగాలలో అదనపు పని భారం వలన తగిన విశ్రాంతి ఉండదు.

వృశ్చికం: ఆదాయ మార్గాలు పెరుగుతాయి. సన్నిహితులతో గృహమున ఆనందంగా గడుపుతారు. వ్యాపారాలలో నూతన పెట్టుబడుల విషయంలో శుభవార్తలు అందుతాయి. చాలాకాలంగా పూర్తి కాని పనులను పూర్తి చేయగలుగుతారు. ఉద్యోగాల్లో అనుకూల వాతావరణం ఉంటుంది. నిరుద్యోగులకు శుభవార్తలు అందుతాయి.


ధనస్సు: మిత్రులతో కొన్ని విషయాలలో మాటపట్టింపులు తప్పవు. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. రావలసిన సొమ్ము సకాలంలో చేతికి అందక ఇబ్బంది కలుగుతుంది. ముఖ్యమైన వ్యవహారాలలో అవాంతరాలు కలుగుతాయి. వ్యాపారాలలో తొందరపాటు నిర్ణయాలు చేయడం మంచిది కాదు. ఉద్యోగ యత్నాలు మందకొడిగా సాగుతాయి.

మకరం: ధార్మిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఆదాయం సంతృప్తికరంగా ఉంటుంది. వృత్తి వ్యాపారాలలో నూతనోత్సాహంతో ముందుకు సాగుతారు. సమాజంలో పలుకుబడి పెరుగుతుంది. ఇంతకాలం పడిన కష్టానికి తగ్గ ఫలితం దక్కుతుంది. ఉద్యోగస్తులకు జీతభత్యాల విషయంలో శుభవార్తలు అందుతాయి.

కుంభం: సంఘంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. సోదరులతో స్థిరాస్తి విషయాలలో నూతన ఒప్పందం చేసుకుంటారు. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. సంతాన ఉద్యోగ, వివాహయత్నాలు సానుకూల ఫలితాలనిస్తాయి. వృత్తి వ్యాపారాలు సాఫీగా సాగుతాయి. ఉద్యోగాలలో అనుకూల వాతావరణం ఉంటుంది.

మీనం: సన్నిహితులతో కొంత జాగ్రత్తగా వ్యవహరించాలి. ముఖ్యమైన వ్యవహారాలలో పునరాలోచన చేయడం మంచిది. వ్యాపారాలలో గందరగోళ పరిస్థితులు ఉంటాయి. ఇంటా బయట పరిస్థితులు అనుకూలించవు. ఆదాయానికి మించి ఖర్చులుంటాయి. ఉద్యోగాలలో సహోద్యోగులతో వివాదాలు తప్పవు.





# నోటి కాడి ముద్ద

మొదటి పేజీ తరువాయి

మక్కలు ఇప్పటికీ కొనుగోలు చేయలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యంపై మండిపడ్డారు. జగిత్యాల-నిజామాబాద్ జాతీయ రహదారిపై ధర్నాకు దిగి, ట్రాఫిక్‌ను స్తంభింపజేశారు. దీంతో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. మరోవైపు, జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలో ఈదురు గాలులతో కూడిన తేలికపాటి వర్షం కురిసింది. కోరుట్ల నియోజకవర్గంతో పాటు కథలాపూర్, మేడిపల్లి మండలాల్లో ఈదురుగాలులతో భారీ వర్షం పడింది. మెట్ పల్లి మార్కెట్ యార్డులో భారీ వర్షంతో మొక్కజొన్న, ధాన్యం తడిచింది. పలు గ్రామాల్లో ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న ధాన్యం, మొక్కజొన్నలోకి నీరు చేరింది. పలు ప్రాంతాల్లో మామిడి నేలరాలింది. కథలాపూర్ మండలం తక్కళ్లపల్లి శివారులో భారీ ఈదురు గాలులతో వెంకటేశ్వర రైస్‌మిల్ యంత్ర భాగాలు కూలడంతో భారీ నష్టం వాటిల్లింది. నిర్మల్ జిల్లా ఖానాపూర్, కడెం మండలాలలో ఓ మోస్తరు వర్షం కురుస్తోంది. భైంసా మండలం మాటేగాం గ్రామం వద్ద రైతులు ఆందోళనకు దిగారు. మొక్కజొన్న కొనుగోలులో జాప్యంతో అకాల వర్షం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయని నిరసన తెలిపారు. నిజామాబాద్ జిల్లాలో పలుచోట్ల వర్షం కురిసింది. బాల్కొండ, మోర్తాడ్, ఏర్గట్ల, వేల్పూరు, ఆర్మూర్,ధర్పల్లి మండలాల్లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. పలుచోట్ల కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది. రైతన్నలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కామారెడ్డి జిల్లా లింగంపేట్ మండలంలోని కంచుమహల్, కొండాపూర్, ముంబాజీపేట్, భవానీపేట్, జల్దిపల్లి, రాంపూర్ భారీ వర్షం కురిసింది. గ్రామాలలో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షంతో.. ఆరబోసిన ధాన్యం నీటిలో తడిసి ముద్దయింది.

రైతులకు కలెక్టర్ భరోసా

కొనుగోలు కేంద్రాలు, కల్లాల్లో ఆరబెట్టిన వరి ధాన్యం వర్షానికి తడిసిపోవడంతో జగిత్యాల జిల్లా కలెక్టర్ గురువారం సాయంత్రం వర్ష ప్రభావిత గ్రామాల్లో ఆకస్మికంగా పర్యటించారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను స్వయంగా పరిశీలించిన కలెక్టర్ తడిసిన ధాన్యం కుప్పలను పరిశీలించి, అక్కడికక్కడే రైతులతో ముఖాముఖి మాట్లాడారు. వర్షాల కారణంగా ఎదురవుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. రైతులు అధైర్యపడవద్దని, ప్రభుత్వం పూర్తిగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించిన కలెక్టర్ , ధాన్యం కుప్పలపై వెంటనే టార్పాలిన్లు కప్పాలని ఆదేశించారు. కల్లాల చుట్టూ నీరు నిల్వ కాకుండా కాల్వలు తవ్వాలని, తడిసిన ధాన్యాన్ని విడిగా ఆరబెట్టే ఏర్పాట్లు చేయాలని సూచించారు. అలాగే కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు 24 గంటలు అందుబాటులో ఉండాలని ఆదేశించిన కలెక్టర్.. ప్రతి కొనుగోలు కేంద్రంలో డ్రయ్యర్లు, ఫ్యాన్లు, క్లీనింగ్ మిషన్లు సిద్ధంగా ఉంచాలని తెలిపారు. గన్నీ బ్యాగుల కొరత లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..ఒక్క రైతు కూడా అధైర్యపడవద్దని వర్షానికి తడిసిన ప్రతి గింజనూ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని హామి ఇచ్చారు . రైతుకు ఒక్క రూపాయి కూడా నష్టం జరగకుండా చర్యలు తీసుకుంటాం" అని స్పష్టం చేశారు. వెంటనే రెవెన్యూ శాఖ, జిల్లా పౌరసరఫరాల శాఖ, వ్యవసాయ శాఖ అధికారులకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేసి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు.

# డ్రగ్స్.. తంబాకు!

మొదటి పేజీ తరువాయి

కార్యాలయంతో పాటు అక్కడ నిలిపి ఉన్న వాహనాలను కూడా ధ్వంసం చేశారు. కార్యాలయ అద్దాలు పగులగొట్టడంతో పాటు అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ ఘటనతో ఒక్కసారిగా కరీంనగర్ నగరం ఉలిక్కిపడింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి ప్రయత్నించారు. హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి కార్యాలయంలో ఉన్నారనే సమాచారంతోనే దాడి జరిగిందని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. ఇదే సమయంలో బండి సంజయ్‌తో పాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా పక్కా ప్రణాళికతో హత్యాయత్నానికి పాల్పడ్డారని కౌశిక్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. క్యాంప్ కార్యాలయం, కార్లపై జరిగిన ధ్వంసానికి సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో రాష్ట్రవ్యాప్తంగా ఈ వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది. ఇదిలా ఉండగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సిరిసిల్ల పర్యటనకు వస్తున్నారనే సమాచారంతో అక్కడ కూడా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బండి సంజయ్ పర్యటనను అడ్డుకునేందుకు ప్రయత్నించిన బీఆర్ఎస్ శ్రేణులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీంతో సిరిసిల్లలో భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో రోడ్లపైకి రావడంతో ఎక్కడికక్కడ ఉద్రిక్త దృశ్యాలు కనిపించాయి. కేటీఆర్, బండి సంజయ్ మధ్య డ్రగ్స్ ఆరోపణలతో మొదలైన రాజకీయ యుద్ధం ఇప్పుడు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో బీజేపీ వర్సెస్ బీఆర్ఎస్‌గా మారిపోయింది. రెండు పార్టీల నేతలు పరస్పరం తీవ్ర ఆరోపణలు చేసుకుంటుండగా.. జిల్లాలో పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారే అవకాశం ఉందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

# 20లోగా డబుల్ లబ్ధిదారుల ఎంపిక

మొదటి పేజీ తరువాయి

అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసి.. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, లబ్ధిదారులకు లబ్ధిని చేకూర్చాలని కోరారు. ఇక ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలులో జిల్లా కలెక్టర్లకే ఎక్కువ అధికారాలను ఇచ్చినట్లు పొంగులేటి శ్రీనివాసరెడ్డి వివరించారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు విడుదలయ్యేలా చూడాలని కలెక్టర్లకు సూచించారు. అక్రమాలకు తావులేకుండా ఇందిరమ్మ ఇండ్ల పథకం ఫలాలు అర్హులకే దక్కేలా చూడాలని.. ఈ విషయంలో ఎక్కడైనా పొరపాటు జరిగితే ఉపేక్షించేది లేదని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రంలో లక్ష మందికిపైగా జనాభా ఉన్న మండలాల్లో అదనపు తహశీల్దార్‌ను నియమించనున్నట్లు మంత్రి తెలిపారు. దీనిపై కలెక్టర్లు ప్రతిపాదనలను సిద్ధం చేయాలని ఆదేశించారు.

# మమత సర్కార్ బర్తరఫ్

మొదటి పేజీ తరువాయి

ఎన్నుకుంటారు. అమిత్‌షా సమక్షంలో సీఎం ఎంపిక జరుగుతుంది. సీఎం రేసులో సువేందు అధికారి ముందంజలో ఉన్నారు. ప్రమాణస్వీకార కార్యక్రమానికి ప్రధాని మోదీ, అమిత్‌షాతో పాటు కేంద్రమంత్రులు హాజరవుతారు. ఇందుకోసనం 5000 మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు చేశారు. బెంగాల్ సీఎం పదవి బెంగాలీకే దక్కుతుందని అమిత్‌షా స్పష్టం చేశారు. బెంగాలీ మీడియం చదువుకున్న వాళ్లనే సీఎం చేస్తామని స్పష్టంచేశారు. ఈ నేపథ్యంలో ఈ అర్హతలు సువేందు అధికారికే ఉన్నాయంటూ మద్దతుదారులు పేర్కొంటున్నారు.

# మూడ్రోజులు వానలు

హైదరాబాద్, మే 7 (ఈవార్తలు): భానుడి భగభగలతో అల్లాడుతున్న తెలుగు రాష్ట్రాల ప్రజలకు వాతావరణ శాఖ శుభవార్త చెప్పింది. కర్ణాటక నుంచి రాయలసీమ, తెలంగాణ మీదుగా ఏర్పడిన ద్రోణి ప్రభావంతో రానున్న మూడు రోజులపాటు రెండు రాష్ట్రాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ఈ వాతావరణ మార్పులవల్ల గత కొన్ని రోజులుగా నమోదవుతున్న గరిష్ఠ ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గి వాతావరణం చల్లబడే అవకాశం ఉందని తెలిపింది. తెలంగాణ విషయానికి వస్తే.. ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్గొండ, మెదక్, ఖమ్మం, నిజామాబాద్ జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఎక్కువగా ఉంది. ఈ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతోపాటు బలమైన ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. అకాలవర్షాల నేపథ్యంలో ఉరుములు సంభవించే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, బయట తిరగవద్దని అధికారులు సూచించారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా దీని ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. ఉత్తర కోస్తా, దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. తీర ప్రాంతాల్లో ఉరుములతో కూడిన జల్లులు పడవచ్చని వాతావరణ కేంద్రం అంచనా వేసింది. ముఖ్యంగా రైతులు కోతకు వచ్చిన పంటలను కాపాడుకోవడానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ధాన్యం తడవకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులు సూచించారు.

# వడ్డీ లేని రుణాలు 10 లక్షలు

మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వం ఐదు లక్షల నుంచి రూ.10లక్షలకు పెంచింది. ఈ విషయాన్ని మంత్రి సీతక్క వెల్లడించారు. బ్యాంకు నుంచి మహిళా సంఘాలు తీసుకునే రూ.10 లక్షల రుణాలపై వడ్డీ మొత్తాన్ని తెలంగాణ ప్రభుత్వమే భరిస్తుందని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. గురువారం రోజున ప్రజాభవన్‌లో జరిగిన కార్యక్రమంలో మహిళా స్వయం సహాయక బృందాలకు ఇచ్చే బ్యాంకు వార్షిక రుణ ప్రణాళికను సీతక్క ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి సీతక్క.. గత ఆర్థిక సంవత్సరంలో స్వయం సహాయక సంఘాలలోని సభ్యులకు రూ.25,228.89 కోట్ల మేరకు బ్యాంకు రుణాలు ఇచ్చినట్లు వెల్లడించారు. మహిళా సంఘాలకు అందిస్తున్న వడ్డీ లేని రుణాల కోసం తెలంగాణ ప్రభుత్వం రూ.2,500 కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. మహిళా ఉన్నతి-తెలంగాణ ప్రగతి అనేదే తెలంగాణ ప్రభుత్వం నినాదమన్నారు మంత్రి సీతక్క. పేదరికం నుంచి మహిళలు బయట పడినప్పుడే.. సంపూర్ణ అభివృద్ధి సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలనే సంకల్పంతో పనిచేస్తున్నట్లు వెల్లడించారు. మరోవైపు మహిళలకు ఈ సంవత్సరం రూ.26 వేలకోట్లకు పైగా బ్యాంకు రుణాలు అందిస్తామని మంత్రి సీతక్క తెలిపారు. అలాగే మహిళా సంఘాలకు.. పంట కొనుగోలు కేంద్రాల్లో 40 శాతం అప్పగిస్తామని వెల్లడించారు. తీసుకున్న బ్యాంకు రుణాలను తిరిగి చెల్లించే విషయంలో మహిళా స్వయం సహాయక సంఘాలు అద్భుతమైన ప్రతిభను కనబరుస్తున్నాయని కొనియాడారు. నిర్మల్ జిల్లా జీరో ఎన్పీఏ సాధించడం చరిత్రాత్మకమన్న సీతక్క.. నిర్మల్ జిల్లాను స్ఫూర్తిగా తీసుకుని అన్ని జిల్లాలు వందశాతం రీపేమెంట్ సాధించాలని ఆకాంక్షించారు.

## మోడల్ స్కూల్స్ ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదలం

మొదటి పేజీ తరువాయి

వారిలో 6వ తరగతి విద్యార్థులు 19,563 మంది, 7 వ తరగతికి 4282 మంది, 8 వ తరగతికి 3908 మంది, 9 వ తరగతికి 2313 మంది, పదో తరగతికి 479 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ప్రస్తుతం కేవలం మెరిట్ జాబితాను మాత్రమే విడుదల చేశారు. తుది ఎంపిక ప్రక్రియ, సీట్ల కేటాయింపు అనేది రిజర్వేషన్ నిబంధనలు, ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాల ప్రకారం సంబంధిత మోడల్ స్కూల్ స్థాయిలో జరుగుతుందని అధికారులు స్పష్టం చేశారు. తదుపరి షెడ్యూల్‌ను త్వరలోనే వెల్లడించనున్నారు.

# అమెరికా-ఇరాన్ జల'సంధి'!

మొదటి పేజీ తరువాయి

తిరిగి మూసేసింది. అనంతరం అమెరికా కూడా ఈ జలసంధిని దిగ్బంధించింది. ఈ మధ్య కాలంలో కొన్ని నౌకలకు మాత్రం అనుమతి లభించింది. ఇక, ఇక్కడ చిక్కుకుపోయిన నౌకల్ని విడిపించేందుకు అమెరికా ప్రాజెక్ట్ ఫ్రీడమ్ ప్రారంభించిన సంగతి తెలిసిందే. వాణిజ్య నౌకలకు రక్షణగా, అమెరికా యుద్ధ విమానాల్ని మోహరించాలనుకుంది. కానీ, ఇరాన్‌తో చర్చల్లో ముందడుగు పడటంతో ప్రాజెక్ట్ ఫ్రీడమ్‌ను ఆపేస్తున్నట్లు అమెరికా తెలిపింది. మరోవైపు ఇరాన్‌తో చర్చలు సానుకూలంగా సాగుతున్నాయని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. హార్ముజ్ జలసంధి అందుబాటులోకి వస్తే అంతర్జాతీయంగా చమురు అందుబాటులోకి వస్తుంది.

# రాష్ట్రవ్యాప్తంగా హైడ్రా

మిర్యాలగూడ, మే 7 (ఈవార్తలు): రాష్ట్రవ్యాప్తంగా హైడ్రాను విస్తరించాలని తెలంగాణ సర్కారు నిర్ణయం తీసుకున్నట్లు హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో రంగనాథ్ గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన ఆయన.. రాష్ట్రవ్యాప్తంగా హైడ్రా సేవలు విస్తరించాలంటూ ప్రజల నుంచి వినతులు ఎక్కువగా వస్తున్నాయని రంగనాథ్ అన్నారు. ఈ నేపథ్యంలో హైడ్రాను రాష్ట్రమంతా విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని వెల్లడించారు. హైడ్రాకు కబ్జాలపై వేలాదిగా ఫిర్యాదులు వస్తున్నాయని.. ఆ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఈ క్రమంలోనే నాలుగు వారాలు ప్రజావాణిని రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. హైడ్రాకు ఇప్పటికే చాలా ఫిర్యాదులు, దరఖాస్తులు వచ్చాయని వాటిని పరిష్కరించడం కోసమే నాలుగు వారాలు ప్రజావాణి కార్యక్రమం రద్దు చేసినట్లు రంగనాథ్ వివరించారు. హైడ్రాకు వ్యతిరేకంగా కొంతమంది న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నారని పేర్కొన్నారు. మరోవైపు హైడ్రా చర్యల కారణంగా ఇప్పటి వరకూ సుమారుగా రూ. 85 వేల కోట్ల విలువైన భూములను కబ్జాల నుంచి కాపాడామని రంగనాథ్ వెల్లడించారు.

# విజయ్ బీస్ట్ మోడ్

మొదటి పేజీ తరువాయి

పడింది. ప్రస్తుతం టీవీకే మిత్రుల మద్దతు కోసం చూస్తుండగా వీసీకే ఇంకా తమ వైఖరిని స్పష్టం చేయలేదు. ఇక తమిళనాడులో అన్నాడీఎంకే-డీఎంకే మధ్య పొత్తు అంటూ వస్తున్న వార్తల నేపథ్యంలో అన్నాడీఎంకే ఎమ్మెల్యే అన్బళగన్ వ్యాఖ్యలు తమిళనాడు రాజకీయాల్లో పెను దుమారం రేపాయి. తాము కూడా మ్యాజిక్ ఫిగర్ 118 కోసం ప్రయత్నిస్తున్నామని అన్నారు. రాబోయే రోజుల్లో మహా అద్భుతం జరుగుతుందంటూ హింట్ ఇచ్చారు. ప్రస్తుతం ఆయన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. ఈ పరిణామాల నేపథ్యంలో తమిళనాడు రాజకీయాలు సినిమాల్లో మించిన ట్విస్టులను గుర్తుచేస్తున్నాయి.

**మేమే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం: అన్నాడీఎంకే**

అనిశ్చితికి తెరదించుతూ తమిళనాడులో అన్నాడీఎంకే త్వరలోనే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతోందని ఆ పార్టీ సీనియర్ నేత అన్బళగన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎవరూ ఊహించని విధంగా తమిళనాడులో ఒక 'అద్భుతం' జరగబోతోందని ఆయన అన్నారు. ఈ వ్యాఖ్యలు ఇప్పుడు సర్వత్రా కలకలం రేపుతున్నాయి. అన్బళగన్ మీడియాతో మాట్లాడుతూ.. 'మాకు ప్రస్తుతం 118 మంది ఎమ్మెల్యేల మద్దతు లభిస్తోంది. రాజ్యాంగబద్ధంగా, ప్రజాస్వామ్యబద్ధంగా మేమే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం. అందరినీ ఆశ్చర్యపరిచే విధంగా ఇతర పక్షాల మద్దతు కూడా మాకు లభించబోతోంది' అని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ ఏర్పాటు దిశగా పావులు కదుపుతున్న ఆ పార్టీ, తమ ఎమ్మెల్యేలు చేజారిపోకుండా జాగ్రత్తలు తీసుకుంటోంది. సీనియర్ నేతల పర్యవేక్షణలో సుమారు 27 మంది ఎమ్మెల్యేలు పుదుచ్చేరిలోని ఒక ప్రైవేట్ రిసార్టుకు చేరుకున్నారు. సీవీ షణ్ముగం నేతృత్వంలో మిగతా ఎమ్మెల్యేలను మరొక రహస్య ప్రాంతానికి తరలించినట్లు సమాచారం. తమ ఎమ్మెల్యేలపై ఒత్తిడి రాకుండా ఉండేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడిస్తున్నాయి.

# ఫార్మా భూములు తిరిగి ఇచ్చేయాల్సిందే

## ఫ్యూచర్ సిటీ పేరుతో బలవంతపు భూసేకరణ సరికాదు.. రైతులకు న్యాయం జరిగే వరకు ముందుండి పోరాడుతాం

**తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత**

హైదరాబాద్, మే 7 (ఈవార్తలు): ఫార్మా సిటీ రైతుల పక్షాన రణం చేస్తామని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చీఫ్ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. ఫార్మా సిటీ కోసం సేకరించిన భూములను వెంటనే రైతులకు తిరిగి ఇచ్చేయాలని డిమాండ్ చేశారు. బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో "ఫార్మా సిటీలో ఏం జరుగుతోంది" అంశంపై గురువారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో కవిత పాల్గొని రైతులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫార్మా సిటీ భూసేకరణ కోసం తెచ్చిన జీవో 31 ను రద్దు చేయాలన్నారు. ఫార్మా సిటీ, ఫ్యూచర్ సిటీ పేరుతో రైతులను ఆగం చేస్తే ఎట్టి పరిస్థితుల్లో ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఫార్మాసిటీ భూముల విషయంలో గత ప్రభుత్వం నిసిగ్గుగా అబద్దాలు చెబితే...అవే అబద్దాలను ఈ ప్రభుత్వం కొనసాగిస్తుందని మండిపడ్డారు. నిజం చెప్పే దమ్ము ఈ ప్రభుత్వాలకు లేదన్నారు. ఫార్మా సిటీ భూముల విషయంలో తెలంగాణ రక్షణ సేనయే ముందుండి బాధితుల తరపున కొట్లాడుతుందని చెప్పారు. ప్రశ్నించటం, పోరాడటం, పరిష్కరించటం అనే విధానంతో తాము ముందుకు వెళ్తున్నామని... ఫార్మా సిటీ బాధిత రైతుల సమస్య పరిష్కరించే వరకు కొట్లాడుతామని స్పష్టం చేశారు.

### రైతుల భూములు తిరిగి ఇచ్చేయాలి

ఫార్మాసిటీ కోసం సేకరించిన భూములను రైతులకు వెంటనే ఇచ్చేయాలని కవిత అన్నారు. రైతుల అంగీకారం లేకుండానే వారి భూములను సేకరించారని మండిపడ్డారు. గత ప్రభుత్వం ఫార్మాసిటీ లో భూముల సేకరణ కోసం జీవో 31ను తీసుకొచ్చిందన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఆ జీవోను రద్దు చేస్తామని చెప్పి...అధికారంలోకి వచ్చాక రైతుల మోసం చేస్తుందన్నారు. జీవో 31 రద్దు చేయకపోగా ఫ్యూచర్ సిటీ పేరుతో భూ సేకరణను 13,500 ఎకరాల నుంచి 30 వేల ఎకరాలు చేశారన్నారు. గత ప్రభుత్వం నిసిగ్గుగా ఫార్మాసిటీ కోసం 13 వేల 5 వందల ఎకరాలు సేకరించినట్లు ప్రకటించిందని గుర్తు చేశారు. కానీ దాంట్లో కందుకూరు మండలంలో 3500 ఎకరాలు, యాచారం మండలంలో 6500 ఎకరాలు అసైన్డ్ భూమే ఉందని కవిత చెప్పారు. వాటికి సంబంధించి కోర్టులో స్టే ఉన్న సరే బీఆర్ఎస్ ప్రభుత్వం లెక్కచేయలేదని విమర్శించారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అబద్దాలు చెబుతూ కోర్టును, ప్రజలను మోసం చేస్తుందన్నారు. కోర్టులో ఫార్మా సిటీ కొనసాగిస్తామని చెబుతూ...బయట మాత్రం రేవంత్ సర్కార్ ఫ్యూచర్ సిటీ కోసం ఈ భూముల సేకరణ మొదలు పెట్టిందని విమర్శించారు. ఎట్టి పరిస్థితుల్లో రైతులకు అన్యాయం జరగనిచ్చేది లేదని తేల్చిచెప్పారు.

### ప్రశ్నించటం, పోరాడటం, పరిష్కరించడం మా విధానం

మన సమస్యలు తీరాలంటే పోరాటమే శరణ్యమని కవిత అన్నారు. వేరే పార్టీల సంగతి ఎలా ఉన్న సరే తాము మాత్రం ఫార్మా సిటీ రైతుల కోసం ముందుండి కొట్లాడతామని చెప్పారు. ప్రశ్నించటం, పోరాడటం, పరిష్కరించడం తమ విధానమని చెప్పారు. వెలుగుమట్లలో సమస్య పరిష్కరమయ్యే వరకు నిరాహార దీక్షకు కూర్చోవడంతోనే బాధితులకు న్యాయం జరిగిందన్నారు. మొండి ప్రభుత్వాలు దిగిరావాలంటే జగమొండిగా ఉండాల్సిందేనని కవిత స్పష్టం చేశారు. రైతులకు న్యాయం జరగాలంటే ఏం చేయాలో కలిసి కట్టుగా నిర్ణయం తీసుకోని ముందుకు వెళ్దామన్నారు. మనం గట్టిగా కొట్లాడకపోవటంతోనే కోర్టులో స్టే ఉన్న కూడా ఈ ప్రభుత్వాలు లెక్క చేయడం లేదని చెప్పారు. ప్రభుత్వం దిగి వచ్చే వరకు పోరాటం కొనసాగిద్దామని సూచించారు.

### ఫ్యూచర్ సిటీ అంత మోసం

ఫ్యూచర్ సిటీ పేరుతో రేవంత్ సర్కార్ ప్రజలందరినీ మోసం చేస్తోందని కవిత అన్నారు. బుల్లెట్ ట్రైన్ వస్తోందని, 6 లక్షల కోట్ల ఎంఓయూలు, డేటా సెంటర్లు అంటూ అబద్దాల పునాదుల మీద ఫ్యూచర్ సిటీ నిర్మాణం చేయాలనుకుంటున్నారని చెప్పారు. డేటా సెంటర్ల పేరుతో ప్రజలను కాలుష్యం కోరల్లోకి నెట్టేస్తారా అని ప్రశ్నించారు. డేటా సెంటర్ల ద్వారా వచ్చే శబ్దానికి పక్షులు బతికే పరిస్థితి ఉండదని, అమెరికా లాంటి దేశాలు డేటా సెంటర్లు పెట్టటం లేదని చెప్పారు. వాటి కారణంగా వచ్చే నష్టాన్ని ఇప్పటి వరకు ఎవరు అంచనా వేయలేదన్నారు. ఎకరాకు రూ.8 లక్షల పరిహారం మాత్రమే ఇస్తామని అంటే వారి బతుకుదెరువు పరిస్థితి ఏమిటని కవిత ప్రశ్నించారు. ఫ్యూచర్ సిటీపై ఫోకస్ పెడితే హైదరాబాద్ కోర్ సిటీ దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వం ఈ ప్రయత్నాన్ని విరమించుకోవాలని సూచించారు.



### పంట కొనుగోళ్లు ఎత్తివేసేందుకు మంత్రుల కమిటీ

రైతులు పండించిన పంటను కొనుగోలు చేయకుండా ఎత్తివేసే ప్రయత్నాల్లో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఉందని అన్నారు. మొన్నటి కేబినెట్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకొని ఆ విషయం కూడా బయటికి చెప్పలేదన్నారు. గతంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం, ఇప్పుడున్న కాంగ్రెస్ ఏ ప్రభుత్వం కూడా ప్రజలకు నిజాలు చెప్పటం లేదన్నారు. అసలు ప్రభుత్వాలు నిజాలు చెప్పలేని పరిస్థితిలో ఎందుకు ఉన్నాయో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఫార్మా సిటీ, ఫ్యూచర్ సిటీ సహా చాలా అంశాల్లో ప్రభుత్వం అబద్దాలు చెబుతుందన్నారు. ఇటీవల జరిగిన కేబినెట్ మీటింగ్ లో స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నోటి వెంట రైతులు పండించే ధాన్యం కొనుగోలు చేసే పరిస్థితి లేదన్న మాటలు వచ్చాయన్నారు. కానీ ఈ విషయాన్ని ఏ మీడియా రాయలేదని చెప్పారు. వచ్చే ఏడాది నుంచి పంట కొనుగోళ్లు ఉండవన్నారు. అందుకోసం ముగ్గురు మంత్రులతో రేవంత్ రెడ్డి కమిటీ వేశారని కవిత చెప్పారు. ఆ కమిటీ ఈ ఏడాది రైతుల పంట కొనుగోలు చేయాలని సూచించిందని... కానీ వచ్చే ఏడాది నుంచి పంట కొనుగోళ్లు ఉండవన్నారు. చాలా విషయాల్లో ప్రభుత్వం ఇదే విధంగా మోసాలకు పాల్పడుతుందని... ప్రజలకు నిజాలు చెప్పే దమ్ము లేదా అని కవిత పశ్నించారు.


## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.


### శాంతి భద్రతల వైఫల్యం

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

హైదరాబాద్, మే 7 (ఈవార్తలు): కరీంనగర్‌లో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంప్ కార్యాలయంపై దాడి ఘటనను బీఆర్ఎస్ అగ్రనేతలు కేటీఆర్, హరీశ్ రావు తీవ్రస్థాయిలో ఖండించారు. ప్రజాస్వామ్యంలో ఇటువంటి భౌతిక దాడులకు తావులేదని, ఇది అధికార పార్టీ అండతో జరుగుతున్న దుశ్చర్య అని వారు మండిపడ్డారు. ఘటన జరిగిన వెంటనే కౌశిక్ రెడ్డికి కేటీఆర్ ఫోన్ చేసి మాట్లాడారు. దాడి జరిగిన తీరును అడిగి తెలుసుకున్న కేటీఆర్... కౌశిక్ రెడ్డితో పాటు అక్కడ ఉన్న పార్టీ కార్యకర్తల భద్రత గురించి ఆరా తీశారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి (బండి సంజయ్) ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోనే, ఆయన అనుచరులు ఇలా బహిరంగంగా దాడులకు పాల్పడటం అత్యంత దురదృష్టకరమని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఇది శాంతిభద్రతల వైఫల్యానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. మాజీ మంత్రి హరీశ్ రావు ఈ ఘటనను 'ప్రజాస్వామ్యంపై జరిగిన దాడి'గా అభివర్ణించారు. ఎమ్మెల్యే కార్యాలయంపై కర్రలు, రాడ్లతో దాడి చేసిన వారిపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేసి, కఠినంగా శిక్షించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలో గూండాయిజం పెచ్చుమీరుతోందని, పోలీసులు ప్రేక్షక పాత్ర వహించడం సరికాదని హరీశ్ రావు మండిపడ్డారు.

### సురేఖను రాజీనామా చేయించండి

**జైశ్రీరామ్ అంటే కొండంత బలం**

గోషామహల్, మే 7 (ఈవార్తలు): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతంలో ఏబీవీపీలో ఉన్నప్పుడు 'జైశ్రీరామ్' అన్నారని, మరి తన కేబినెట్ మంత్రికి దానిని నేర్పించలేదా అని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ప్రశ్నించారు. 'జైశ్రీరామ్' అంటే పైనుంచి డబ్బులు రాలుతాయా అని ప్రశ్నించిన మంత్రి కొండా సురేఖపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దేవాదాయ శాఖ మంత్రి అంటే దేవుడికి అనుకూలంగా ఉండాలని, కానీ కొండా సురేఖ మాత్రం భిన్నంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. కొండా సురేఖ ఏ శాఖకు మంత్రో గుర్తుంచుకోవాలని హితవు పలికారు. జైశ్రీరామ్ అంటే కొండంత బలం వస్తుందని, కానీ అనుచితంగా మాట్లాడితే మంత్రి పదవి ఊడిపోతుందని ముఖ్యమంత్రి ఆమెకు చెప్పాలని సూచించారు. కొండా సురేఖ ఆ వ్యాఖ్యలు చేసినందుకు ఏం చర్యలు తీసుకున్నారని ముఖ్యమంత్రిని ప్రశ్నించారు. తెలంగాణలో దేవాదాయ శాఖ భూముల కబ్జాలపై ఆమె దృష్టి సారించాలని కోరారు. హైదరాబాద్‌లోని పాతబస్తీలో దేవుడి భూములను మజ్లిస్ పార్టీ నాయకులు కబ్జాలు చేశారని ఆరోపించారు.

# పదేళ్లలో గ్లోబల్ సిటీగా హైదరాబాద్

## భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు.. పెట్టుబడులను భారీగా ఆకర్షించేలా అభివృద్ధి ప్రణాళికలు

**'నాస్కామ్ జీసీసీ సమ్మిట్ 2026'లో మంత్రి శ్రీధర్ బాబు**

ముంబై: అంతర్జాతీయ పెట్టుబడులను భారీగా ఆకర్షించేలా... పదేళ్లలో హైదరాబాద్ ను గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దేందుకు తమ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. మహా నగరాల అభివృద్ధిలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించేలా... భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యమిస్తోందని వివరించారు. గురువారం ముంబైలో నిర్వహించిన 'నాస్కామ్ జీసీసీ సమ్మిట్ 2026'లో 'బియాండ్ పాలసీ: డిజైన్డ్ టు విన్ ది గ్లోబల్ జీసీసీ రేస్' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... 2047 నాటికి దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచాలనే సంకల్పంతో 'తెలంగాణ రైజింగ్ విజన్ 2047'కు శ్రీకారం చుట్టామని వివరించారు. ప్రపంచంలోని అనేక నగరాలు అస్తవ్యస్త పట్టణీకరణ వల్ల 'అర్బన్ కొలాప్స్' కోరల్లో చిక్కుకున్నాయని, అలాంటి చారిత్రక తప్పిదాన్ని హైదరాబాద్ విషయంలో తాము చేయాలనుకోవడం లేదన్నారు. అందుకే... భవిష్యత్తు కోసం ఎదురు చూడకుండా, దాన్ని నిర్మించే బాధ్యతను తీసుకున్నామన్నారు. ఆ దిశగానే భారత్ ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ, మెట్రో విస్తరణ, కొత్త విమానాశ్రయాల అభివృద్ధి, ఆర్ఆర్ఆర్, మూసీ ప్రక్షాళన, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, ఐకం ఇన్నోవేషన్ హబ్ తదితర కీలక ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టామన్నారు. కేవలం టెక్ కంపెనీలే కాకుండా... బ్యాంకింగ్, లైఫ్ సైన్సెస్, సెమీ కండక్టర్లు, రక్షణ రంగం, ఎఫ్ఎంసీజీ, స్పేస్ టెక్, ఆతిథ్యం తదితర బహుళ రంగాలకు చెందిన దిగ్గజ సంస్థలు జీసీసీల ఏర్పాటుకు హైదరాబాద్ ను తమ మొదటి ప్రాధాన్యంగా ఎంచుకుంటున్నాయన్నారు. గతేడాది 70కి పైగా జీసీసీలు ప్రారంభమయ్యాయని, దేశంలో ఇదే అత్యధికమని వివరించారు. ఈ ఏడాది కొత్తగా 100 జీసీసీలను ప్రారంభించి... వాటిల్లో కొత్తగా లక్ష మందికి ఉపాధి కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. జీసీసీలను కేవలం బ్యాక్ ఆఫీస్ ఆపరేషన్లకే పరిమితం చేయకుండా... వాటిని 'గ్లోబల్ వాల్యూ సెంటర్లు'గా మార్చేలా ప్రత్యేక 'కాంప్రహెన్సివ్ రోడ్డు మ్యాప్'ను సిద్ధం చేస్తున్నామన్నారు. పారిశ్రామికాభివృద్ధికి అన్ని రకాలుగా అనుకూలంగా ఉన్న తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని పారిశ్రామికవేత్తలను మంత్రి శ్రీధర్ బాబు కోరారు. హైదరాబాద్‌లో ఉన్న 'సిలికాన్ డెన్సిటీ (విభిన్న రంగాల నిపుణుల లభ్యత)'ని అందిపుచ్చుకుని 'మేడిన్ తెలంగాణ' బ్రాండ్ ను విశ్వవ్యాప్తం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం తరఫున అన్ని రకాలుగా అండగా ఉంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో నాస్కాం ఛైర్మన్ శ్రీకాంత్, ప్రెసిడెంట్ రాజేష్ నంబియార్ తదితరులు పాల్గొన్నారు.




### కార్యకర్తల సహనాన్ని పరీక్షించొద్దు

**కేంద్ర మంత్రి బండి సంజయ్**



కరీంనగర్, మే 7 (ఈవార్తలు): కరీంనగర్‌లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం మీద జరిగిన దాడి ఘటనపై కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ స్పందించారు. బీఆర్ఎస్ నాయకులు మితిమీరిన అహంకారంతో ప్రవర్తిస్తున్నారని, తమ కార్యకర్తలకు కూడా సహనం ఉంటుందని, కానీ ఆ సహనాన్ని పిరికితనంగా భావించవద్దని హెచ్చరించారు. కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై దాడి జరిగిన విషయం తనకు ఆలస్యంగా తెలిసిందని అన్నారు. దాడులు చేయడం, దౌర్జన్యాలకు దిగడం తమ సంస్కృతి కాదని అన్నారు. కానీ బీఆర్ఎస్ నాయకులు తమ సహనాన్ని పరీక్షించవద్దని బండి సంజయ్ అన్నారు. ప్రస్తుతం బీఆర్ఎస్ నేతల నీతి వ్యాఖ్యలు చూస్తుంటే నవ్వొస్తుందని అన్నారు. పదేళ్లలో ఆ పార్టీ చేసిన అరాచకాలను ప్రజలు మరిచిపోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పాలన రజాకార్లను తలపించిందని ఆరోపించారు. దాడుల సంస్కృతిని ఆ పార్టీయే ఆరంభించిందని విమర్శించారు. గతంలో తాను చేపట్టిన ప్రజాసంగ్రామయాత్రను అడ్డుకోవడానికి బీఆర్ఎస్ శ్రేణులు ఎన్నో ఇబ్బందులు సృష్టించాయని అన్నారు. నాడు పదుల సంఖ్యలో కార్లను ధ్వంసం చేశారని ధ్వజమెత్తారు. మహిళా కార్యకర్తలపై కూడా దాడులు చేశారని ధ్వజమెత్తారు. గతంలో చేసిన దాడులను మరిచిపోయి ఇప్పుడు సానుభూతి కోసం ప్రయత్నిస్తున్నారని బండి సంజయ్ అన్నారు.

# కర్షకులపై కనికరమేది?

**సీఎం రేవంత్‌పై హరీశ్ ధ్వజం**



భువనగిరి, మే 7 (ఈవార్తలు): వడ్ల కుప్పల వద్ద రైతుల గుండెల ఆగిపోతున్నా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కనీస కనికరం లేదని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో ఇలాంటి పరిస్థితిని తెలంగాణలో ఎప్పుడూ చూడలేదని అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని హరీశ్ రావు సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నెల రోజులుగా వడ్లను కొనుగోలు చేయడం లేదని విమర్శించారు. తరుగు పేరుతో రైతులను దోచుకుంటున్నారని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని మండిపడ్డారు. వడ్ల కుప్పల వద్దనే రైతుల గుండెలు ఆగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా జరుగుతున్నాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారని, కానీ వాస్తవాలు ఇందుకు విరుద్ధంగా ఉన్నాయని మండిపడ్డారు. నేను వారిలా ఏసీ గదిలో కూర్చుని మాట్లాడటం లేదని విమర్శించారు. రైతుల మధ్య నిల్చుని, వారి గోడు విని మాట్లాడుతున్నానని అన్నారు. కల్లాలలో రైతులు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. తేమ పరీక్షకు పదిరోజులు, గోనె సంచులకు వారం రోజులు, కాంటా (తూకం) పెట్టడానికి మరో వారం రోజులు పడుతుందని ఆరోపించారు. మిల్లులకు వెళ్లిన తర్వాత కూడా లారీకి నాలుగైదు బస్తాల వరకు కటింగ్ పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షాలతో రైతులు తీవ్ర ఆందోళనతో ఉన్నారని హరీశ్ రావు అన్నారు. చౌటుప్పల్ మార్కెట్‌లో వర్షం పడితే కనుక వడ్ల కుప్పలు నీట మునిగే ప్రమాదం ఉందని అన్నారు. ప్రభుత్వం వెంటనే యుద్ధ ప్రాతిపదికన కొనుగోళ్లు జరపాలని డిమాండ్ చేశారు. రైతుబంధు, యూరియా, రుణమాఫీ, ధాన్యం కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. తరుగు పెడితే తోలు తీస్తామని గతంలో సీఎం చెప్పారని, ఇప్పుడు బస్తాకు రెండు మూడు కిలోల తరుగు తీస్తుంటే ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు.

### స్వాగతిస్తున్నాం!

**కరీంనగర్ డీసీసీ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే మేడిపెల్లి సత్యం**

కరీంనగర్, మే 7 (ఈవార్తలు): కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అనుచరులు చేసిన దాడిని స్వాగతిస్తున్నట్లు తెలిపేలా కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, కాంగ్రెస్ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తన సోషల్ మీడియా ఖాతాలో పోస్టు చేయడం తీవ్ర చర్చకు దారితీసింది. ప్రజాస్వామ్యంలో రాజకీయ పార్టీ కార్యాలయాలపై దాడులు జరగడం దురదృష్టకరమైతే, అలాంటి ఘటనలను ప్రజాప్రతినిధులే సమర్థించడం మరింత ప్రమాదకరమని బీఆర్ఎస్ నేతలు మండిపడుతున్నారు. "దాడులను ఖండించాల్సిన కాంగ్రెస్ నేతలు, వాటిని స్వాగతించడం వెనుక అసలు రాజకీయ అజెండా ఏమిటి..?" అంటూ ప్రశ్నిస్తున్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు బయటకు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటూ, లోపల మాత్రం బీఆర్ఎస్‌ను టార్గెట్ చేస్తూ కలిసి పనిచేస్తున్నాయనే అనుమానాలు ఈ ఘటనతో మరింత బలపడుతున్నాయని బీఆర్ఎస్ శ్రేణులు ఆరోపిస్తున్నాయి. "రాజకీయంగా ఎదుర్కోలేకే దాడులు, విధ్వంసాలను ప్రోత్సహిస్తున్నారా..?" అంటూ మండిపడుతున్నారు. కరీంనగర్‌లో ప్రశాంత వాతావరణాన్ని చెడగొట్టేలా రాజకీయ నేతల వ్యాఖ్యలు ఉండకూడదని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. దాడులను ప్రోత్సహించేలా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడం ద్వారా సమాజానికి ఎలాంటి సందేశం ఇస్తున్నారో కాంగ్రెస్ నేతలు ఆలోచించాలని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి.



# 'అడవి'లో ఏసీబీ వల

## చిక్కిన లంచగొండి ఎఫ్‌డీవో

భద్రాచలం, మే 7 (ఈవార్తలు): ఒక రోడ్డు వేస్తుండగా కొన్ని చెట్లు కట్ కావడంతో వాటి గురించి కేసు నమోదు చేయకుండా ఉండేందుకు భద్రాచలం అటవీ శాఖ ఎఫ్‌డిఓ సుజాత రూ.10 లక్షలు డిమాండ్ చేశారు. ఈ క్రమంలో గురువారం రూ.3.5 లక్షలు లంచం తీసుకుంటూ ఉండగా ఏసీబీ డీఎస్పీ వై.రమేష్ ఆధ్వర్యంలో ఆమెను, చర్ల ఇంచార్జ్ డీఆర్ఓ కృష్ణయ్యను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. చర్ల మండలం పూసుగుప్ప ప్రాంతంలో రోడ్డు వేస్తుండగా పొరపాటున చెట్లు దెబ్బ తిన్నాయి. ఈ ఎపిసోడ్‌లో ఎఫ్‌డీఓ సుజాత రూ.10లక్షలు డిమాండ్ చేసి భద్రాచలం కార్యాలయంలో రూ.3.5 లక్షలు లంచం తీసుకుంటూ డీఆర్ఓతో పాటు పట్టుబడ్డారు. గతంలో కూడా కొత్తగూడెం అటవీ అభివృద్ధి సంస్థ జిల్లా అధికారి మూడున్నర లక్షలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు.




## రిజైన్ చేస్తే ఎగ్జిట్ ప్యాకేజీ: మైక్రోసాఫ్ట్

న్యూయార్క్: టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ తన 50 ఏళ్ల చరిత్రలో తొలిసారిగా స్వచ్ఛంద పదవీ విరమణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తోంది. అమెరికాలోని దీర్ఘకాల ఉద్యోగులకు ఈ ప్రత్యేక ఆఫర్‌ను అందిస్తూ, ఆరోగ్య సంరక్షణ, నగదు చెల్లింపులు, స్టాక్ ప్రయోజనాలతో కూడిన 'ఎగ్జిట్ ప్యాకేజ్'ను ప్రకటించింది. కంపెనీలో పని చేసిన సంవత్సరాలు, ఉద్యోగి వయస్సు కలిపి 70 ఏళ్లు దాటిన వారు ఈ పథకానికి అర్హులు. ఈ ప్యాకేజీలో ప్రధాన ఆకర్షణ ఐదేళ్ల వరకు ఆరోగ్య సంరక్షణ మద్దతు. మొదటి ఏడాది వైద్య, దంత, కంటి చికిత్సల ఖర్చులను కంపెనీ పూర్తిగా భరిస్తుంది. తర్వాతి నాలుగేళ్ల పాటు ఉద్యోగులు తమ ప్రీమియంలు చెల్లిస్తూ అదే కవరేజ్ కొనసాగించుకోవచ్చు. దీంతో పాటు, ఉద్యోగి హోదా, సర్వీస్ కాలాన్ని బట్టి ఒకేసారి చెల్లించే సెవరెన్స్ ప్యాకేజీ కూడా ఉంటుంది. మిడ్, సీనియర్ స్థాయి ఉద్యోగులకు గరిష్టంగా 39 వారాల జీతం వరకు ప్రయోజనం లభించే అవకాశం ఉంది. స్టాక్ ప్రయోజనాలను కూడా మైక్రోసాఫ్ట్ ఆఫర్ చేస్తోంది. నివేదికల ప్రకారం, మైక్రోసాఫ్ట్ ఉద్యోగుల్లో దాదాపు 7 శాతం మంది, అంటే సుమారు 8,750 మంది ఈ ప్రోగ్రామ్‌కు అర్హులు. ఈ ప్రోగ్రామ్ కోసం కంపెనీ సుమారు 900 మిలియన్ డాలర్ల వ్యయాన్ని భరించనుంది. మరోవైపు, త్వరలో మైక్రోసాఫ్ట్ ఉద్యోగులను తొలగించాలని భావిస్తోంది. ఏఐ కోసం పెట్టుబడులు, ఖర్చుల నియంత్రణ నేపథ్యంలో ఈ లేఆఫ్స్ ఉండనున్నట్టు తెలుస్తోంది.

## 'సైబర్ నేరాలతో బెంగ'ళూరు



న్యూఢిల్లీ: దేశంలో సైబర్ నేరాలకు సంబంధించి బెంగళూరు మరోసారి అత్యధిక కేసులు నమోదైన మహానగరంగా నిలిచింది. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) తాజా గణాంకాల ప్రకారం, 2024లో బెంగళూరులో 17,561 సైబర్ నేరాల కేసులు నమోదయ్యాయి. ఇది గత ఏడాదితో పోలిస్తే స్వల్పంగా తక్కువ అయినప్పటికీ, దేశంలోని ఇతర నగరాలతో పోలిస్తే చాలా ఎక్కువ. ప్రతి లక్ష జనాభాకు 206.6 కేసుల చొప్పున నమోదైన సైబర్ నేరాల రేటు కూడా దేశంలోనే అత్యధికంగా ఉంది. బెంగళూరులో నమోదైన కేసుల్లో ఎక్కువ భాగం ఆన్‌లైన్ మోసాలకు సంబంధించినవే. ముఖ్యంగా, ఇతరుల పేరుతో నటిస్తూ డిజిటల్ మోసాలకు పాల్పడే కేసులు భారీగా నమోదయ్యాయి. నివేదిక ప్రకారం, ఐటీ చట్టంలోని సెక్షన్ 66డీ కింద మాత్రమే 16 వేలకు పైగా కేసులు నమోదయ్యాయి. మొత్తంగా చూస్తే, అత్యధిక నేరాల వెనుక ప్రధాన ఉద్దేశం 'మోసం' చేయడమేనని తేలింది. ఇటువంటి కేసులు 16,842 నమోదయ్యాయి. అయితే కేసుల సంఖ్య పెరుగుతున్నప్పటికీ, దర్యాప్తు, శిక్షల విషయంలో ఇంకా సవాళ్లు కొనసాగుతున్నాయి. గతేడాది నమోదైన వేలాది కేసులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. సరైన సాక్ష్యాలు దొరకకపోవడం, నిందితులను గుర్తించలేకపోవడం వంటి కారణాలతో అనేక కేసులు మూతబడ్డాయి. బెంగళూరులో ప్రస్తుతం 11 ప్రత్యేక సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్లు పనిచేస్తున్నప్పటికీ, పెరుగుతున్న డిజిటల్ నేరాలకు తగిన మానవ వనరులు, సాంకేతిక సామర్థ్యాలు అవసరమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. జాతీయ స్థాయిలో కూడా సైబర్ నేరాలు వేగంగా పెరుగుతున్నాయి. 2024లో దేశవ్యాప్తంగా లక్షకు పైగా కేసులు నమోదయ్యాయి. ఇది గతేడాదితో పోలిస్తే దాదాపు 18 శాతం ఎక్కువ. ఇతర మెట్రో నగరాల విషయానికి వస్తే, ముంబై అత్యధిక సైబర్ నేరాల కేసుల నమోదులో రెండో స్థానంలో నిలిచింది (4,939 కేసులు). ఆ తర్వాతి స్థానాల్లో హైదరాబాద్ (4,009 కేసులు), చెన్నై (1,882 కేసులు) ఉన్నాయి. ముంబై, హైదరాబాద్ తదుపరి స్థానాల్లో నిలిచినా, బెంగళూరుతో పోలిస్తే వాటి సంఖ్య చాలా తక్కువ. మరోవైపు, ఢిల్లీలో గత మూడేళ్లుగా సైబర్ నేరాలు తగ్గుముఖం పట్టడం గమనార్హం. ఇక్కడ కేసుల సంఖ్య 2022లో 685 నుంచి 2023లో 407కి, ఆపై 2024లో 404కి తగ్గింది. డిజిటల్ ఆర్థిక వ్యవస్థ వేగంగా విస్తరిస్తున్న సమయంలో, సైబర్ భద్రత ఇప్పుడు కేవలం టెక్నాలజీ సమస్య కాకుండా, ప్రజల ఆర్థిక భద్రతకు సంబంధించిన కీలక అంశంగా మారుతోంది.

## 'ఆపరేషన్ సిందూర్'తో పాక్ కుదేల్

**భారత్ సైనిక చర్యతో దాయాది ఆర్థిక వ్యవస్థ ఢమాల్**

ఇస్లామాబాద్: పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థను 'ఆపరేషన్ సిందూర్' తీవ్ర సంక్షోభంలోకి నెట్టింది. 2025 మే నెలలో చేపట్టిన ఈ చర్య కారణంగా పెట్టుబడులు, పర్యాటకం, విమానయానం, ఎగుమతుల రంగాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని గ్రీస్‌కు చెందిన 'గ్రీస్ సిటీ టైమ్స్' అనే మీడియా సంస్థ తన నివేదికలో వెల్లడించింది. ఈ ఆపరేషన్ కారణంగా పాకిస్థాన్‌లో ద్రవ్యోల్బణం పెరిగి, ఆర్థిక వృద్ధి మందగించి, ఇప్పటికే బలహీనంగా ఉన్న ఆర్థిక పునాదులు మరింత క్షీణించాయని నివేదిక విశ్లేషించింది. అధిక అప్పులు, విదేశీ మారకద్రవ్య నిల్వల కొరత, అంతర్జాతీయ సహాయంపై ఆధారపడటం వంటి సమస్యలతో ఇప్పటికే సతమతమవుతున్న పాక్ ఆర్థిక వ్యవస్థపై 'ఆపరేషన్ సిందూర్' మరింత భారాన్ని మోపింది. గత మూడేళ్లుగా ఆ దేశ జీడీపీ వృద్ధి సగటున 3 శాతం వద్దే స్తబ్దుగా ఉందని, పారిశ్రామిక ప్రగతి మందగించిందని నివేదిక గుర్తుచేసింది. ఈ సైనిక చర్యతో దేశంలో అనిశ్చితి పెరిగి, పెట్టుబడిదారులు వెనక్కి తగ్గారు. దీంతో వారు 'వేచి చూసే ధోరణి' అవలంబించగా.. బీమా, రుణ వ్యయాలు పెరిగాయి. ఈ సైనిక చర్య ప్రత్యక్ష ప్రభావం పర్యాటక రంగంపై పడింది. అంతర్జాతీయ పర్యాటకులు తమ పర్యటనలను రద్దు చేసుకోవడంతో హోటళ్లు, రెస్టారెంట్లు, టూర్ ఆపరేటర్లు, పర్యాటకంపై ఆధారపడిన స్థానిక వర్గాలు తీవ్రంగా నష్టపోయాయి. మరోవైపు, విమానయాన రంగం కూడా తీవ్ర ఒడుదొడుకులను ఎదుర్కొంది. విమాన సర్వీసులకు అంతరాయం కలగడంతో ఎయిర్‌లైన్స్‌తో పాటు ఎగుమతిదారులు, దిగుమతిదారులు, ప్రయాణికులపై వ్యయభారం పెరిగింది. ముఖ్యంగా టెక్స్‌టైల్స్, ఫార్మాస్యూటికల్స్, త్వరగా పాడైపోయే వస్తువుల ఎగుమతులు ఆలస్యం కావడంతో వాణిజ్య రంగం దెబ్బతింది. ఈ పరిణామాల నేపథ్యంలో అంతర్జాతీయ కొనుగోలుదారులు పాకిస్థాన్‌కు బదులుగా బంగ్లాదేశ్, వియత్నాం, భారత్ వంటి దేశాల నుంచి వస్తువులను కొనుగోలు చేసేందుకు మొగ్గు చూపుతున్నారని నివేదిక పేర్కొంది. 'ఆపరేషన్ సిందూర్' కారణంగా పాకిస్థాన్‌లో ద్రవ్యోల్బణం కూడా ప్రమాదకర స్థాయిలో పెరుగుతోంది. 2025లో 4.5 శాతంగా ఉన్న ద్రవ్యోల్బణం, 2026లో 7.2 శాతానికి, 2027 నాటికి 8.4 శాతానికి చేరుకుంటుందని ఈ నివేదిక అంచనా వేసింది. మొత్తంమీద, ఈ సైనిక చర్య పాకిస్థాన్‌కు కోలుకోలేని ఆర్థిక నష్టాన్ని మిగిల్చిందని స్పష్టమవుతోంది.

## మమత సమావేశానికి 10 మంది ఎమ్మెల్యేల డుమ్మా

కోల్‌కతా: బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడంతో 15 ఏండ్ల తృణమూల్ కాంగ్రెస్ పాలనకు తెరపడింది. ఓటమితో తృణమూల్ పార్టీలో పొరపొచ్చాలు చోటుచేసుకున్నాయనే వార్తలు వినిపిస్తున్నాయి. తాజాగా పార్టీ అధినేత మమతా బెనర్జీ ఏర్పాటుచేసిన కీలక సమావేశానికి 10 మంది ఎమ్మెల్యేలు గైర్హాజరయ్యారు. ఈ సమావేశంలో మమత కొందరు పార్టీ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారని భోగట్టా. దీనికితోడు కీలక సమావేశానికి 10 మంది నూతన ఎమ్మెల్యేలు హాజరుకాకపోవడం పార్టీలోని అంతర్గత పోరును బహిర్గతం చేసింది.

# విజయ్‌ని ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించండి

### గవర్నర్‌కు డీఎంకే, వీసీకే విజ్ఞప్తి



చెన్నై: అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలుచుకున్న టీవీకే పార్టీకి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అవకాశం ఇవ్వాలని, ఆ పార్టీ అధ్యక్షుడు విజయ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడానికి ఆహ్వానించాలని సీపీఐ, వీసీకే పార్టీలు గవర్నర్□కు విజ్ఞప్తి చేశాయి. అసెంబ్లీలో తన మెజారిటీని నిరూపించుకోవడానికి ఆయనకు అవకాశం ఇవ్వాలని అన్నారు. తమిళనాడులో ప్రభుత్వం ఏర్పాటుపై గవర్నర్ నిర్ణయంలో జాప్యం జరుగుతోంది. ఈ క్రమంలో వివిధ పార్టీలు స్పందించాయి. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి విజయ్‌కి అవకాశమివ్వాలని గవర్నర్‌ను కోరిన వీసీకే, ప్రభుత్వానికి సహకరించే అవకాశంపై మాత్రం స్పష్టత ఇవ్వలేదు. ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి టీవీకేకు తొలుత అవకాశమివ్వాలని డీఎంకే కూడా స్పష్టం చేసింది. గవర్నర్ రాజ్యాంగ పరిధిలోనే వ్యవహరించాలని సీపీఐ డిమాండ్ చేసింది. ప్రజలు ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ ఇవ్వలేదని, కానీ 108 స్థానాలు గెలుచుకున్న టీవీకేకు మొదట అవకాశమివ్వాలని పేర్కొంది. విజయ్ ఇప్పటికే రెండుసార్లు గవర్నర్‌ను కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి ఆహ్వానం పలకాలని కోరిన విషయాన్ని గుర్తుచేసింది. విజయ్ ప్రమాణ స్వీకారం చేయకముందే మెజారిటీ నిరూపించుకోవాలని గవర్నర్ ఒత్తిడి చేయడం సరికాదని అభిప్రాయపడింది. దీనిని సీపీఐ వ్యతిరేకిస్తోందని పేర్కొంది. అత్యధిక స్థానాలు గెలిచిన విజయ్‌కి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశమివ్వాలని, ఆ తర్వాత సభలో మెజారిటీ నిరూపించుకోవడానికి ఆయనకు అవకాశమివ్వాలని కోరింది. తమిళనాడులో ఏకైక అతిపెద్ద పార్టీగా టీవీకేను ప్రజలు ఎన్నుకున్నారని, అందువల్ల విజయ్‌కి మొదట అవకాశం ఇవ్వాలని వీసీకే అధ్యక్షుడు తిరుమావళవన్ అన్నారు. కానీ గవర్నర్ ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం గందరగోళానికి తావిస్తోంది అన్నారు. విజయ్‌ని ఆహ్వానించకపోవడం ఆమోదయోగ్యం కాదని అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్ షా రాజకీయ ఒత్తిడి తెస్తున్నారేమోనని ప్రజలకు అనుమానం కలుగుతోందని తమిళనాడు యూత్ కాంగ్రెస్ మరో ప్రకటనలో పేర్కొంది. గవర్నర్ నిబంధనల ప్రకారం నడుచుకోవాలని, అత్యధిక మెజారిటీ ఉన్న పార్టీని ప్రభుత్వ ఏర్పాటు కోసం ఆహ్వానించాలని తెలిపింది. ప్రభుత్వ ఏర్పాటుకు టీవీకేను ఆహ్వానించకపోతే యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన చేపడతామని, గవర్నర్ ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించింది.

# బేరసారాలు చేయనివ్వను

**మెజారిటీతో రమ్మని చెప్పా**

**ప్రభుత్వ ఏర్పాటును అడ్డుకోవడం లేదు**

**తమిళనాడు గవర్నర్ వివరణ**



చెన్నై: ప్రస్తుతం తమిళనాడు రాజకీయాలలో ప్రస్తుతం తీవ్ర అనిశ్చితి నెలకొంది. ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన ఎమ్మెల్యేల మద్దతు తప్పనిసరిగా చూపించాల్సిందేనని ఆ రాష్ట్ర గవర్నర్ తేల్చిచెప్పడంతో అక్కడ పొలిటికల్ హీట్ పెరిగింది. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్ర గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. మైనారిటీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ద్వారా ఎమ్మెల్యేల బేరసారలకు పరోక్షంగా అనుమతి ఇవ్వలేమన్నారు. తమిళనాడు గవర్నర్ తీరు ప్రస్తుతం వివాదాస్పదంగా మారింది. ఆయన తీరును కాంగ్రెస్‌తో పాటు అక్కడి పలువురు నేతలు ఖండించారు. ఈ ఆందోళనల నేపథ్యంలో ఆ రాష్ట్రంలోని ఓ పత్రికకు గవర్నర్ ఇంటర్వ్యూ ఇచ్చారు. విశ్వనాథ్ అర్లేకర్ మాట్లాడుతూ.."మెజారిటీ లేకపోవడం అన్నది ఒక్క విజయ్ సమస్య మాత్రమే కాదు. తమిళనాడు సమస్య మైనారిటీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి బేరసారాలకు అనుమతించలేం. విజయ్‌ని మెజారిటీ నిరూపించమని మేము అనలేదు. మెజార్టీతో వస్తేనే ప్రభుత్వ ఏర్పాటుకు అనుమతిస్తాం అని తెలిపాం. కాని వారు అలా చేయలేదు. దీనికి నేను ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయకుండా ఎలా అడ్డుకుంటున్నట్లు. ఏఐడీఎంకే, డీఎంకే కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశం ఉంది. ఎస్.ఆర్ బొమ్మై కేసులోని ఉత్తర్వు దీనికి వర్తించదు" అని అన్నారు. కాగా విజయ్‌కు జెడ్‌ప్లస్ సెక్యూరిటీ కల్పించడంపైనా ఆ రాష్ట్ర గవర్నర్ డీజీపీపై సీరియస్ అయ్యారు. ఈ నేపథ్యంలో గవర్నర్‌కు డీజీపీ శాంతిభద్రతలపై నివేదిక అందించారు. మరోవైపు రేపు గవర్నర్ తీరుకు నిరసనగా కాంగ్రెస్ రేపు రాష్ట్ర వ్యాప్తం ఆందోళనలు చేపట్టనున్నట్లు ప్రకటించింది.

# ప్రజాతీర్పుపై అగౌరవం

**గవర్నర్‌పై కమల్ ఫైర్**



చెన్నై: తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం నెలకొన్న రాజకీయ సంక్షోభంపై ప్రముఖ నటుడు, మక్కల్ నీది మయ్యం పార్టీ అధ్యక్షుడు, ఎంపీ కమల్ హాసన్ తీవ్రంగా స్పందించారు. నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ 108 స్థానాలతో అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ, ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నర్ ఆహ్వానించకపోవడాన్ని ఆయన తప్పుబట్టారు. ఇది ప్రజా తీర్పును అగౌరవపరచడమేనని, రాష్ట్రానికి జరిగిన అవమానమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో సుదీర్ఘమైన పోస్ట్ పెట్టారు. "తమిళనాడు శాసనసభ ఎన్నికలలో ఏ ఒక్క పార్టీకీ ప్రజలు స్పష్టమైన మెజారిటీ ఇవ్వలేదు. రాష్ట్ర చరిత్రలో ఇలాంటి ఫలితం రావడం ఇదే తొలిసారి. 'ప్రజల తీర్పును గౌరవిస్తాం, బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా ఉంటాం' అని నా సోదరుడు ఎంకే స్టాలిన్ ప్రకటించడం ఆయన రాజకీయ పరిపక్వతకు నిదర్శనం. ఆయనను నేను గౌరవిస్తున్నాను. ఇప్పుడు రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారు కూడా తమ విధిని నిర్వర్తించాలి. ఇది డిమాండ్ కాదు, వారి రాజ్యాంగపరమైన బాధ్యతను గుర్తుచేయడం మాత్రమే" అని కమల్ హాసన్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. విజయ్ పార్టీని ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించకపోవడంపై కమల్ హాసన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. "విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీ 108 స్థానాలు గెలుచుకుంది. వారిని ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించకపోవడం తమిళనాడు ప్రజల తీర్పును అగౌరవపరచడమే. ఎన్నికైన సభ్యులు ఇప్పటికీ ప్రమాణ స్వీకారం చేయలేకపోవడం రాష్ట్రానికి జరిగిన అవమానం, ప్రజాస్వామ్యానికి కలిగిన నష్టం" అని అన్నారు. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు తీర్పును కూడా ఆయన గుర్తుచేశారు. "మెజారిటీని రాజ్‌భవన్‌లో కాదు, శాసనసభలోనే నిరూపించుకోవాలని ఎస్.ఆర్. బొమ్మై కేసులో సుప్రీం కోర్టు స్పష్టంగా చెప్పింది. నేను పార్టీ రాజకీయాల గురించి మాట్లాడటం లేదు. ఒక భారతీయ పౌరుడిగా విధానపరమైన గళం వినిపిస్తున్నాను. తమిళనాడు ప్రజల తీర్పును తప్పక గౌరవించాలి" అని కమల్ హాసన్ తన పోస్ట్‌లో స్పష్టం చేశారు.



## నమ్మించి గొంతు కోశారు

**సిద్ధాంతాలను పక్కపెట్టారు.. కూటమి ధర్మాన్ని విస్మరించారు**

**కాంగ్రెస్‌పై డీఎంకే మండిపాటు**

చెన్నై: తమిళనాడు ఎన్నికల ఫలితాల తర్వాత రాష్ట్ర రాజకీయాలు ఊహించని మలుపులు తిరుగుతున్నాయి. దశాబ్దాలుగా మిత్రపక్షంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ.. ఇప్పుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కజగం పార్టీతో చేతులు కలపడంపై డీఎంకే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. కాంగ్రెస్ తీసుకున్న ఈ నిర్ణయం తమను నమ్మించి గొంతు కోయడమేనని డీఎంకే నేతలు మండిపడుతున్నారు. ఎన్నికల ఫలితాల్లో ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాకపోవడంతో, ప్రభుత్వ ఏర్పాటుకు కాంగ్రెస్ కీలక పాత్ర పోషిస్తోంది. అయితే, ఇప్పటివరకు డీఎంకే కూటమిలో ఉన్న కాంగ్రెస్, ఎన్నికల ఫలితాలు రాగానే టీవీకేకు మద్దతు ప్రకటించడంపై డీఎంకే అగ్రనేతలు నిప్పులు చెరుగుతున్నారు. "కష్టకాలంలో కాంగ్రెస్‌కు అండగా ఉన్నాం. కానీ నేడు అధికారం కోసం వారు సిద్ధాంతాలను పక్కనపెట్టి కొత్త పార్టీతో జతకట్టడం దారుణం" అని డీఎంకే ప్రతినిధులు వ్యాఖ్యానించారు. ఇది రాజకీయాల్లో అత్యంత తక్కువ స్థాయి ప్రవర్తన అని, ప్రజలు ఈ నమ్మక ద్రోహాన్ని గమనిస్తున్నారని వారు హెచ్చరించారు. దశాబ్దాల స్నేహాన్ని కాంగ్రెస్ తుంగలో తొక్కిందని డీఎంకే ఆవేదన వ్యక్తం చేసింది. టీవీకే-కాంగ్రెస్ కలయిక కేవలం అధికార దాహం కోసమేనని, ఇది తమిళనాడు అభివృద్ధికి ఏమాత్రం మేలు చేయదని విమర్శించింది. రాబోయే రోజుల్లో కాంగ్రెస్‌కు తమ పార్టీ నుంచి ఎలాంటి సహకారం ఉండదని పరోక్షంగా సంకేతాలిచ్చింది. మరోవైపు.. కాంగ్రెస్ మద్దతుతో విజయ్ ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి ప్రయత్నాలు ముమ్మరం చేసిన వేళ, డీఎంకే చేసిన ఈ ఆరోపణలు కూటమి రాజకీయాల్లో పెనుదుమారం రేపుతున్నాయి. పాత మిత్రుల మధ్య మొదలైన ఈ మాటల యుద్ధం తమిళనాడు రాజకీయాలను మరింత వేడెక్కించింది.

## హార్ముజ్ వద్దే 13 భారత నౌకలు: కేంద్రం

న్యూఢిల్లీ: ఇరాన్-అమెరికా యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి హార్ముజ్ జలసంధిని మూసేసిన సంగతి తెలిసిందే. దీంతో ఇండియా సహా అనేక దేశాలకు చెందిన నౌకలు ఈ జలసంధి వద్దే చిక్కుకుపోయాయి. ఈ నేపథ్యంలో జలసంధిలో చిక్కుకుపోయిన భారత నౌకలపై కేంద్ర విదేశాంగ శాఖ ఒక ప్రకటన చేసింది. విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ దీనిపై ప్రకటన చేశారు. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు 11 భారత నౌకలు జలసంధిని దాటాయని ఆయన వెల్లడించారు. ఇంకా 13 నౌకలు పర్షియన్ గల్ఫ్ వద్ద చిక్కుకుపోయినట్లు తెలిపారు. మిగిలన నౌకలు తిరిగి ఇండియా సురక్షితంగా చేరేందుకు నిరంతరం ప్రయత్నిస్తున్నట్లు జైశ్వాల్ చెప్పారు. ఈ విషయంలో ఇరాన్ అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు వెల్లడించారు. ఇరాన్‌తో చర్చలు, సంప్రదింపుల తర్వాత ఇండియా ఈ అంశంలో ముందడుగు స్థితిలోనే ఉందన్నారు. 11 నౌకలు హార్ముజ్ నుంచి సురక్షితంగా ఇండియా చేరాయన్నారు. మిగిలిన నౌకల్ని కూడా ఇండియా రప్పించేందుకు ఇరాన్‌తో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు వెల్లడించారు. అంతర్జాతీయ చమురు రవాణాకు సంబంధించి హార్ముజ్ జలసంధి అత్యంత కీలకం అనే సంగతి తెలిసిందే. హార్ముజ్ మూసివేయడంతో అనేక దేశాలు చమురు సమస్యను ఎదుర్కొంటున్నాయి. ఈ సమస్య పరిష్కారం కోసం ఇండియా సహా అనేక దేశాలు ఎదురుచూస్తున్నాయి. ప్రస్తుతం అనేక దేశాలకు చెందిన నౌకలు ఇంకా అక్కడే చిక్కుకుపోయాయి.



## సువేందు పీఏ హత్య కేసులో సీఐడీ ఎంట్రీ

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ బీజేపీ నేత, ప్రతిపక్ష నాయకుడు సువేందు అధికారి వ్యక్తిగత సహాయకుడు (పీఏ) చంద్రనాథ్ రథ్ దారుణ హత్య కేసు దర్యాప్తును రాష్ట్ర సీఐడీ (క్రైమ్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్) చేపట్టింది. నార్త్ 24 పరగణాల జిల్లాలో జరిగిన ఈ ఘటనపై సీఐడీ అధికారులు విచారణను స్వీకరించారు. ఈ హత్య వెనుక పక్కా ప్రణాళిక ఉన్నట్టు ప్రాథమిక ఆధారాలు సూచిస్తున్నాయి. వివరాల్లోకి వెళితే.. బుధవారం రాత్రి బీజేపీ కార్యక్రమం ముగించుకుని చంద్రనాథ్ రథ్ తన కారులో ఇంటికి బయలుదేరారు. మధ్యమ్‌గ్రామ్‌లోని దోహరియా క్రాసింగ్ వద్దకు రాగానే, ఆయన వాహనాన్ని మరో కారు అడ్డగించింది. అదే సమయంలో హెల్మెట్ ధరించిన ఓ వ్యక్తి బైక్‌పై వచ్చి రథ్ కారు పక్కన ఆపి, అతి సమీపం నుంచి విచక్షణారహితంగా కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో రథ్ అక్కడికక్కడే మృతి చెందగా, కారు డ్రైవర్ బుద్ధదేబ్ బేరా తీవ్రంగా గాయపడ్డారు. దాడికి ఉపయోగించిన కారు, బైక్‌లకు నకిలీ నంబర్ ప్లేట్లు ఉన్నాయని రాష్ట్ర డీజీపీ సిద్ధ్‌నాథ్ గుప్తా ధ్రువీకరించారు. ఘటనా స్థలం నుంచి కొన్ని వాడిన తూటాలు, బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నామని, దర్యాప్తు దృష్ట్యా మరిన్ని వివరాలు వెల్లడించలేమని ఆయన తెలిపారు. గురువారం ఉదయం ఘటనా స్థలానికి చేరుకున్న సీఐడీ అధికారులు, ఆ ప్రాంతాన్ని తమ అధీనంలోకి తీసుకున్నారు. సమీపంలోని సీసీటీవీ కెమెరాల ఫుటేజీలను, హౌసింగ్ కాంప్లెక్స్‌ల బయట ఉన్న కెమెరాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఈ హత్యకు సంబంధించి సీసీటీవీ ఫుటేజ్ ద్వారా కొన్ని కీలక ఆధారాలు లభించినట్టు పోలీసులు తనకు తెలిపారని సువేందు అధికారి పేర్కొన్నారు. మరోవైపు హత్య జరిగిన ప్రాంతాన్ని అధికారులు దిగ్బంధించి, కేంద్ర బలగాలను మోహరించారు. వాహనాల రాకపోకలతో పాటు ప్రజల సంచారాన్ని కూడా నియంత్రించారు. రాష్ట్ర పోలీసులకు చెందిన ఫోరెన్సిక్ బృందం ఇప్పటికే రథ్ కారు నుంచి నమూనాలను సేకరించింది. బరాసత్ మెడికల్ కాలేజీకి చెందిన ముగ్గురు సభ్యుల ఫోరెన్సిక్ బృందం రథ్ మృతదేహానికి శవపరీక్ష నిర్వహించనుంది. ఈ బృందానికి ఫోరెన్సిక్ విభాగం హెడ్ నేతృత్వం వహిస్తున్నారు.

## బిహార్ మంత్రివర్గంలోకి నితీశ్ కొడుకు

పాట్నా: బిహార్‌లో ఎన్‌డీయే ప్రభుత్వ మంత్రివర్గ విస్తరణ గురువారం జరిగింది. మొత్తం 32 మందితో కొత్త మంత్రులతో కూడిన పూర్తిస్థాయి ప్రభుత్వం కొలువుదీరింది. ప్రస్తుతం బిహార్‌లో బీజేపీ, జేడీయూ, ఇతర పార్టీలతో కలిసి ఎన్‌డీయే ప్రభుత్వం అధికారంలో ఉన్న సంగతి తెలిసిందే. మంత్రివర్గ విస్తరణలో మాజీ సీఎం నితీష్ కుమార్ తనయుడు నిశాంత్ కుమార్‌కు చోటు దక్కింది. కూటమిలో బీజేపీకి 15, జేడీయూకు 13, రామ్ విలాస్ ఎల్జేపీకి 2, హెచ్ఏఎం, ఆర్ఎల్ఎం పార్టీలకు ఒక్కో మంత్రి పదవి దక్కింది. కొత్త మంత్రుల ప్రమాణ స్వీకారం పాట్నాలో గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, బీజేపీ జాతీయాధ్యక్షుడు నితిన్ నబిన్, మాజీ సీఎం నితీష్ కుమార్ హాజరయ్యారు. అలాగే కేంద్ర మంత్రులు చిరాగ్ పాశ్వాన్, జితన్ రామ్ మాంఝీ, లాలాన్ సింగ్, ఆర్ఎల్ఎం, ఇతర పార్టీల నేతలు కూడా పాల్గొన్నారు. 2025లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్‌డీయే కూటమి 202 సీట్లు గెలుచుకుంది.

# రైతులకు ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు

**మిల్లర్లకు పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర వార్నింగ్**

జగిత్యాల, మే 7 (ఈవార్తలు): యాసంగి వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సివిల్ సప్లయ్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్‌తో కలిసి నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బ్యాగులు, హమాలీలు, తూకం యంత్రాలు, టార్పాలిన్లు, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండాలని సూచించారు. ధాన్యం కొనుగోలు అనంతరం మిల్లులకు తరలింపులో జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని, రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పూర్తిగా అందేలా పారదర్శకంగా కొనుగోళ్లు నిర్వహించాలని తెలిపారు. మిల్లర్లు నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించిన కమిషనర్, అకాల వర్షాల దృష్ట్యా రైతులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు, మిల్లర్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బి.ఎస్. లత, సంబంధిత శాఖల అధికారులు, రైస్ మిల్లర్ల యజమానులు తదితరులు పాల్గొన్నారు.

# 16 ఏళ్ల సేవలకు గుర్తింపు ఇవ్వాలి

**స్టీఫెన్ రవీంద్రకు ఉద్యోగుల వినతి**

జగిత్యాల, మే 7 (ఈవార్తలు): పౌర సరఫరాల శాఖలో గత 16 సంవత్సరాలుగా ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న తమను వెంటనే రెగ్యులరైజ్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల యూనియన్ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్రకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పౌర సరఫరాల శాఖ కార్యాలయాలు, ఎంఎల్ఎస్ పాయింట్లు, గోదాములు తదితర విభాగాల్లో తాము నిరంతరం సేవలందిస్తున్నామని తెలిపారు. 16 ఏళ్లుగా తక్కువ వేతనాలతో, ఎలాంటి ఉద్యోగ భద్రత లేకుండా పనిచేస్తున్నప్పటికీ శాఖ పనితీరులో కీలక పాత్ర పోషిస్తున్నామని పేర్కొన్నారు. పిడిఎస్, సీఎంఆర్, వరి ధాన్యం రవాణా, గన్నీస్ గోదాములు, అకౌంట్స్ సెక్షన్లలో సమర్థవంతంగా పనిచేస్తూ శాఖకు పూర్తి సహకారం అందిస్తున్నామని తెలిపారు. అనేక ప్రభుత్వ శాఖల్లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసిన నేపథ్యంలో తమ సమస్యను కూడా ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మధు, అజిత్, కల్యాణ్, అరవింద్, సోమశేఖర్, గంగాధర్, వంశీ తదితర ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.




# గోవుల సంరక్షణకు చర్యలు తీసుకోవాలి

హైదరాబాద్, మే 7 (ఈవార్తలు): రాష్ట్రంలో గోవధ నిరోదక చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేసి గోవుల రక్షణకు తగు చర్యలు తీసుకోవాలని లవ్ ఫర్ కౌ ఫౌండేషన్ ట్రస్టీ రితీష్ జాగిర్దార్, శ్రీ జైన్ సేవా సంఘ్ హైదరాబాద్ పీఆర్ఓ ప్రవీణ్ పాండ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు రాష్ట్ర డిజిపి సివి ఆనంద్ ఐపిఎస్ ను కలిసి విజ్ఞప్తి చేసినట్లు వారు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా విచ్చలవిడిగా గోవులను హైదరాబాద్ నగరానికి తరలించే అవకాశం ఉన్నందున ఎక్కడిక్కడ చెక్ పోస్టులను ఏర్పాటు చేసి అక్రమంగా గోవులను తరలించకుండా పోలీస్ సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేయాలని వారు కోరారు. నిత్యం వేలాధి పశువులను వధిస్తుండటంతో గోవుల సంతతి తగ్గిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయానికి వెన్నెముకగా ఉన్న పశువులు మన ఆర్థిక వ్యవస్థకు జీవనాధారమని, శతాబ్దాలుగా మానవ మనుగడకు, సమాజానికి గోవులు ఎన్నో రకాలుగా ఉపయోగపడుతున్నాయని అన్నారు.

# పిఠాపురం టీడీపీ ఇన్‌చార్జ్ వర్మ తొలగింపు

**టీడీపీ హైకమాండ్ సంచలన నిర్ణయం**

విజయవాడ/పిఠాపురం, మే 7 (ఈవార్తలు): 2024 ఎన్నికల తర్వాత ఏపీలోని పిఠాపురం నియోజకవర్గంలో తరచుగా వివాదాలు నెలకొంటుండడంపై టీడీపీ హైకమాండ్ దృష్టిసారించింది.. నియోజకవర్గంలో వరుసగా చోటుచేసుకుంటున్న పరిణామాలను తీవ్రంగా పరిగణించిన టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం పిఠాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌గా ఉన్న ఎస్వీఎస్ఎన్ వర్మను ఆ బాధ్యతల నుంచి తప్పిస్తూ పార్టీ హైకమాండ్ ఆదేశాలు జారీ చేసింది. వర్మను తప్పించడంతో పాటు, నియోజకవర్గంలో పార్టీ కార్యకలాపాలను సమర్థవంతంగా ముందుకు నడిపేందుకు వీలైనంత త్వరగా ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని చంద్రబాబు నిర్ణయించారు. ఈ కమిటీ ఏర్పాటుకు సంబంధించి పార్టీ స్థాయిలో ఇప్పటికే కసరత్తు మొదలైంది. కొత్త కమిటీ ద్వారా నియోజకవర్గంలో పార్టీ శ్రేణుల్లో సమన్వయం సాధించి, పార్టీని మరింత బలోపేతం చేయాలని అధిష్ఠానం భావిస్తోంది. త్వరలోనే ఈ కమిటీ సభ్యులను ప్రకటించనున్నారు. గత కొంతకాలంగా పిఠాపురంలో ఎస్వీఎస్ఎన్ వర్మ వర్గానికి, జనసేన క్యాడర్‌కు మధ్య తరచుగా వివాదాలు ఏర్పడుతున్నాయి. ఇది డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం కావడంతో, కూటమి పొత్తు ధర్మం దెబ్బతినకుండా టీడీపీ అధిష్ఠానం నష్టనివారణ చర్యలకు ఉపక్రమించినట్టు తెలుస్తోంది.

# ఏపీకి రాయల్ ఎన్‌ఫీల్డ్

**రూ. 2,200 కోట్ల భారీ పెట్టుబడి**

తిరుపతి, మే 7 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక రంగానికి భారీ ఊతం లభించింది. ప్రముఖ ఆటోమొబైల్ దిగ్గజం, ఐకానిక్ మోటార్‌సైకిల్ బ్రాండ్ రాయల్ ఎన్‌ఫీల్డ్ తన నూతన తయారీ యూనిట్‌ను ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయనుంది. 1901లో సంస్థ ప్రారంభమైన నాటి నుంచి తమిళనాడు వెలుపల ఇంత భారీ స్థాయిలో విస్తరించడం ఇదే తొలిసారి కావడం విశేషం. తిరుపతి జిల్లా సత్యవేడులో ఈ అత్యాధునిక తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం కంపెనీ రెండు దశల్లో సుమారు రూ. 2,200 కోట్లు పెట్టుబడిగా పెట్టనుంది. ఈ ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సమావేశమైన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి ఆమోదం తెలిపింది. ఈ ప్లాంట్ ద్వారా రాయల్ ఎన్‌ఫీల్డ్ తయారీ సామర్థ్యం దాదాపు 9 లక్షల యూనిట్లు పెరగనుంది. ఈ ప్రాజెక్టు కోసం సత్యవేడు మండలంలోని వన్నెలూరు (233.76 ఎకరాలు), రాళ్ళకుప్పం (42.38 ఎకరాలు) గ్రామాల్లో ప్రభుత్వం మొత్తం 267 ఎకరాల భూమిని కేటాయించింది. ఈ యూనిట్ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 5,000 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. మొదటి దశలో ప్రధాన తయారీ యూనిట్‌తో పాటు, ఒక ప్రత్యేక వెండర్ పార్క్‌ను కూడా అభివృద్ధి చేయనున్నారు. దీనివల్ల సంస్థకు చెందిన సరఫరాదారులు కూడా ఏపీకి తరలివచ్చి, రాష్ట్రంలో ప్రపంచ స్థాయి ఆటోమోటివ్ తయారీ క్లస్టర్ ఏర్పడటానికి దోహదపడుతుంది. మొదటి దశ 2029 నాటికి, రెండో దశ 2032 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ పరిణామంపై రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. "రాయల్ ఎన్‌ఫీల్డ్ కేవలం ఒక మోటార్‌సైకిల్ బ్రాండ్ కాదు, అది వారసత్వం, నాణ్యతకు ఒక ప్రతీక. ఇంతటి ఐకానిక్ కంపెనీని ఏపీకి స్వాగతిస్తున్నందుకు గర్వంగా ఉంది.

# రాష్ట్రంలో ఆటవిక పాలన

## కౌశిక్ రెడ్డిపై దాడి సిగ్గుచేటు.. గన్ కల్చర్‌కు బీజేపీ, కాంగ్రెస్ ప్రోత్సాహం

**బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి ఫైర్**

జగిత్యాల/మల్యాల, మే 7 (ఈవార్తలు): రాష్ట్రంలో ఆటవిక పాలన కొనసాగుతోందని, హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిపై జరిగిన దాడి సభ్య సమాజానికి సిగ్గుచేటని బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్–బీజేపీ కుమ్మక్కు రాజకీయాలతో బిఆర్ఎస్ పార్టీని అణిచివేయలేరని ఆయన స్పష్టం చేశారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావా వసంత, మాజీ ఎమ్మెల్యే రవిశంకర్, వైస్ చైర్మన్ హరిచరణ్ రావుతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జీవన్ రెడ్డి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేటీఆర్ వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి బండి సంజయ్ అనవసరంగా స్పందిస్తున్నారని విమర్శించారు. "కాందిశీకులు" అంశంపై ఎందుకు ఉలిక్కిపడుతున్నారని ప్రశ్నించారు. బండి సంజయ్ మాట్లాడిన భాషను తీవ్రంగా ఖండిస్తున్నామని, రాజకీయ విమర్శలు సభ్య సమాజం అంగీకరించే విధంగా ఉండాలని అన్నారు. హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిపై గంగుల కమలాకర్ క్యాంప్ కార్యాలయంలో జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. కరీంనగర్‌లో ఇటీవల జరిగిన దొంగతనం కేసులో ఇప్పటికీ నిందితులను పట్టుకోలేకపోయారని, రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని ఆరోపించారు. కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కై గన్ కల్చర్‌ను ప్రోత్సహిస్తున్నాయని, భౌతిక దాడులతో బిఆర్ఎస్‌ను అణిచివేయాలని చూస్తున్నారని విమర్శించారు. దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను ఏ1గా చేర్చి విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. హింసా రాజకీయాలతో బిఆర్ఎస్ పార్టీని అణచివేయడం సాధ్యం కాదని హెచ్చరించారు. సీఎం రేవంత్ రెడ్డి ముందుగా బండి సంజయ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలి**

జగిత్యాల జిల్లా మల్యాల మండలం రామన్నపేట గ్రామంలో గ్లోబల్ తెలంగాణ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని జీవన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధి దిశగా ముందుకు సాగేందుకు ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు ఉపయోగపడతాయని అన్నారు. శిక్షణను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని మహిళలకు సూచించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, మహిళలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# అంజన్న జన్మోత్సవాలకు తరలిరండి

**కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు ఆహ్వానం**

మల్యాల/కరీంనగర్, మే 7 (ఈవార్తలు): ఈ నెల 12న కొండగట్టులో నిర్వహించనున్న అంజన్న జన్మోత్సవాలు (పెద్ద జయంతి)కి రావాలని కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు ఆలయ నిర్వాహకులు ఆహ్వానం అందజేశారు. దేవస్థానం ఈవో ఎస్ అంజనారెడ్డి కరీంనగర్ పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో కేంద్ర మంత్రిని కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈవో గుండి హరిహరనాథ్, ఉప ప్రధాన అర్చక చిరంజీవి ,ముఖ్య అర్చక లక్ష్మణ్ ప్రసాద్ సూపరింటెండెంట్ ఉపాధ్యాయుల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. అటు.. ఉత్సవాల నేపథ్యంలో ఆర్జిత సేవలను నిలిపివేస్తున్నట్లు ఈవో పేర్కొన్నారు. కేశఖండన, మాల విరమణ, ప్రత్యేక దర్శనం సేవలు మాత్రమే కొనసాగుతాయని స్పష్టం చేశారు.



**పటిష్ట భద్రత ఏర్పాట్లు**

హనుమాన్ జన్మోత్సవాల సందర్భంగా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా అదనపు ఎస్పీ చేతన్ నితిన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కొండగట్టులో జయంతి ఏర్పాట్లను అధికారులతో కలిసి పరిశీలించిన ఆయన మాట్లాడుతూ, వేలాదిగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఆలయ పరిసరాలు, క్యూలైన్లు, మాలవిరమణ ప్రాంతాలు, పార్కింగ్ స్థలాలు, వాహనాల రాకపోక మార్గాల్లో ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, భక్తుల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలని పేర్కొన్నారు. అలాగే ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఏఎస్పీ వెంట డీఎస్పీ పురుషోత్తం రెడ్డి, సీఐలు రవి, సుధాకర్, కరుణాకర్, ఎస్సై నరేశ్ ఉన్నారు.



# కొండగట్టు ఆలయానికి ఐఎస్వో సర్టిఫికేషన్

మల్యాల, మే 7 (ఈవార్తలు): జగిత్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయం ఇప్పుడు అంతర్జాతీయ స్థాయి గుర్తింపును సొంతం చేసుకుంది. ఆలయ నిర్వహణలో పాటిస్తున్న ఉన్నత ప్రమాణాలు, భక్తుల కోసం ఏర్పాటు చేసిన భద్రతను గమనించి ఐఎస్ఓ సంస్థ ఈ ధ్రువీకరణను అందించింది. ఆలయ పరిపాలన విభాగం పారదర్శకతతో పని చేస్తూ, భక్తి ప్రాధాన్యతను పెంచేలా తీసుకుంటున్న చర్యలకు ఈ అవార్డు ఒక నిదర్శనంగా నిలిచింది. ఆలయ పరిసరాల్లో పరిశుభ్రత పాటించడం, తాగునీరు, క్యూలైన్ల నిర్వహణ వంటి అంశాల్లో కొండగట్టు టీమ్ అద్భుతమైన కృషి చేసింది. ఈ మార్పులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఐఎస్ఓ ప్రతినిధులు రామలక్ష్మి, సత్యసాయి ఈ సర్టిఫికేషన్ అందజేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి అంజనా రెడ్డి ఈ పత్రాలను స్వీకరిస్తూ, ఇది భక్తుల సౌకర్యార్థం చేసిన పనులకు లభించిన గొప్ప పురస్కారమని సంతోషం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో కొండగట్టు క్షేత్రాన్ని మరిన్ని హంగులతో తీర్చిదిద్దేందుకు ఈ గుర్తింపు ఎంతగానో ఉపయోగపడుతుంది. దేవాలయం ప్రతిష్ట పెరగడంతో పాటు, ఇక్కడికి వచ్చే పర్యాటకుల సంఖ్య కూడా మరింత పెరిగే అవకాశం ఉంది. అంజన్న స్వామి భక్తుల కోసం నిరంతరం మెరుగైన వసతులు కల్పిస్తూ, ఆధ్యాత్మిక వాతావరణాన్ని కాపాడేందుకు ఆలయ సిబ్బంది మరింత కష్టపడి పనిచేస్తారని అధికారులు వెల్లడించారు.

# ఎస్ఐఆర్ డిజిటల్ డేటా కోసం వైసీపీ డిమాండ్

**రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిని కోరిన ఎమ్మెల్సీ అప్పిరెడ్డి**

విజయవాడ, మే 7 (ఈవార్తలు): ఏపీలో జరగనున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో పూర్తి పారదర్శకత పాటించాలని వైసీపీ డిమాండ్ చేసింది. ఈ ప్రక్రియకు ఉపయోగించే ఓటరు జాబితాను సెర్చ్ చేయగలిగే డిజిటల్ ఫార్మాట్‌లో తమకు అందించాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో)ను కోరారు. ఎన్నికల ప్రక్రియ నిష్పక్షపాతంగా జరగాలంటే, ఓటరు జాబితా పూర్తి వివరాలు రాజకీయ పార్టీలకు అందుబాటులో ఉండటం అత్యవసరమని అప్పిరెడ్డి అభిప్రాయపడ్డారు. నియోజకవర్గాల వారీగా, బూత్‌ల వారీగా సులభంగా వెతకగలిగేలా డిజిటల్ జాబితాను ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ఓటర్ల జాబితాలో అక్రమ తొలగింపులు, డూప్లికేట్ ఎంట్రీలు, ఓటర్ల మార్పిడి వంటి అంశాలపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయని ఆయన పేర్కొన్నారు.



# జగిత్యాలలో బీజేపీ బలోపేతం

**ఎంపీ అర్వింద్‌తో నేతల భేటీ**

జగిత్యాల, మే 7 (ఈవార్తలు): జగిత్యాల నియోజకవర్గానికి చెందిన భారతీయ జనతా పార్టీ సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ భోగ శ్రావణి ఆధ్వర్యంలో నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్‌ను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జగిత్యాల నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధి, స్థానిక సమస్యలు, కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తదితర అంశాలపై ఎంపీతో చర్చించినట్లు నాయకులు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ఎంపీ అరవింద్ పేర్కొన్నట్లు సమాచారం. అలాగే పార్టీ బలోపేతానికి గ్రామస్థాయిలో మరింత సమన్వయంతో పనిచేయాలని సూచించిన ఆయన, ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రజాప్రతినిధులు ముందుండాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్యే సంజయ్‌కు శుభాకాంక్షలు వెల్లువ

జగిత్యాల, మే 7 (ఈవార్తలు): జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌కు పెళ్లి రోజు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్, జగిత్యాల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు గాజంగి నందయ్య, మున్సిపల్ చైర్మన్ సమీండ్ల వాణి శ్రీనివాస్ కలిసి వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే దంపతులకు పుష్పగుచ్ఛం అందజేసి, ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమాల్లో పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# హల్దీ వాగులో మునిగి ముగ్గురు యువకుల మృతి

సిద్దిపేట, మే 7 (ఈవార్తలు): వివాహ వేడుకలో పాల్గొనేందుకు వచ్చిన ముగ్గురు యువకులు హల్దీ వాగులో మునిగి ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనతో పెళ్లింట సంతోషం స్థానంలో విషాదఛాయలు అలముకున్నాయి. వివరాల్లోకి వెళితే, మెదక్ జిల్లా నర్సాపూర్‌కు చెందిన పెళ్లి బృందం బుధవారం ఓ వివాహ వేడుక కోసం సిద్దిపేట జిల్లా తూప్రాన్‌కు వెళ్లింది. వేడుక ముగిశాక వారిలో కొంతమంది యువకులు సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం నాచారం గ్రామానికి వచ్చారు. ఇక్కడి శ్రీ లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న అనంతరం, సరదాగా ఈత కొట్టేందుకు సమీపంలోని హల్దీ వాగులోకి దిగారు. అయితే, వాగు లోతును అంచనా వేయడంలో విఫలమవడంతో ముగ్గురూ నీటిలో మునిగి గల్లంతయ్యారు. స్థానికులు గమనించి వారిని కాపాడేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, గజ ఈతగాళ్ల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు.




# కన్నతల్లిని కొట్టి గెంటేసిన కొడుకు

మల్యాల/జగిత్యాల,మే 7 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండలం తాటిపల్లి గ్రామానికి చెందిన కాముని లక్ష్మి(70) అనే వృద్ధురాలిని ఆమె కుమారుడు శ్రీనివాస్ కొట్టి ఇంట్లోంచి గెంటివేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. భర్త మరణించిన తర్వాత తనను ఆరుగురు కుమారులు పట్టించుకోవడం లేదని, అనారోగ్యంతో ఉన్నా వైద్య సహాయం కూడా అందించడం లేదని వృద్ధురాలు ఆవేదన వ్యక్తం చేసింది. మూడో కుమారుడు శ్రీనివాస్ తనపై దాడి చేసి ఇంటి నుంచి వెళ్లగొట్టాడని పేర్కొంది. దీంతో ఆమె సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్‌ను ఆశ్రయించి, ఆయన సహాయంతో ఆర్డీవోకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు వయోవృద్ధుల సంరక్షణ, పోషణ చట్టంలోని సెక్షన్ 2(ఎ), 23 కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే వారికి జైలు శిక్ష విధించే అవకాశం ఉందని హరి అశోక్ కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హన్మంత్ రెడ్డి, విశ్వనాథం, సత్యనారాయణ, కరుణ తదితరులు పాల్గొన్నారు.





# ఆధునిక వ్యవసాయంపై దృష్టి పెట్టాలి

**రైతులకు ఎమ్మెల్యే సంజయ్ దిశానిర్దేశం**

జగిత్యాల రూరల్, మే 7 (ఈవార్తలు): జగిత్యాల రూరల్ మండలం పొలాస గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన రైతు వారం కార్యక్రమంలో జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" కార్యక్రమంతో పాటు విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పీఎం కుసుమ్ పథకంపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం రైతు వేదిక ఆవరణలో ఏర్పాటు చేసిన సోలార్ పంపు సెట్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. రైతులు ఆధునిక సాంకేతికతను వినియోగించుకుని వ్యవసాయంలో అభివృద్ధి సాధించాలని, ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు గాజంగి నందయ్య, డీఏవో భాస్కర్, సర్పంచ్ శంకర్, ఎస్ఈ సుదర్శన్, ఏఎంసీ చైర్మన్ గడ్డం నారాయణరెడ్డి, నాయకులు, రైతులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వయ్యారి చిత్రం



అప్సరా రాణి




## హీరోయిన్ వల్లే ఎల్లమ్మ లేట్!

బలగం లాంటి బ్లాక్ బాస్టర్ తర్వాత తదుపరి సినిమా విషయంలో దర్శకుడు వేణు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాడు. మొదట ఎల్లమ్మ అనే టైటిల్‌తో నాని హీరోగా ఓ సినిమా తెరకెక్కబోతుందని ప్రచారం జరిగింది. దాదాపు ఈ ప్రాజెక్ట్ ఫైనల్ అయి షూటింగ్ కూడా ప్రారంభం కానుందనే స్థాయిలో వార్తలు వచ్చిన తర్వాత నాని ఈ మూవీ నుంచి తప్పుకున్నాడు. ఆ తర్వాత ఈ కథలో నితిన్ హీరోగా నటించనున్నట్లు టాక్ వినిపించింది. దీనికి తగ్గట్టుగానే నిర్మాత దిల్ రాజు కూడా ఈ ప్రాజెక్ట్‌పై క్లారిటీ ఇచ్చాడు. కానీ కొన్ని కారణాల వల్ల నితిన్ కూడా ఈ సినిమా నుంచి బయటకు వచ్చాడు. దీంతో బలగం వంటి భారీ విజయానంతరం కూడా వేణు తన తదుపరి ప్రాజెక్ట్‌ను సెట్స్‌పైకి తీసుకెళ్లడంలో ఇబ్బందులు పడుతున్నాడనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఇలాంటి సమయంలోనే సంగీత దర్శకుడు దేవిశ్రీప్రసాద్ హీరోగా ఎల్లమ్మ సినిమా ఫిక్స్ అయినట్లు అధికారిక ప్రకటన వెలువడింది. దీంతో ఈ ప్రాజెక్ట్ ట్రాక్‌లోకి వచ్చింది. అయితే ఇప్పుడు మరో సమస్య ఈ మూవీని ఆలస్యం చేస్తోందనే వార్తలు వినిపిస్తున్నాయి. ఈ సినిమాలో హీరోయిన్‌గా మంచి క్రేజ్ ఉన్న స్టార్ బ్యూటీని తీసుకోవాలని మేకర్స్ భావిస్తున్నారట.

## నన్ను రోడ్డుపై పడేయొద్దు



చాలా కాలం తర్వాత మెగాఫోన్ పట్టిన ప్రముఖ దర్శకుడు, నటుడు పోసాని కృష్ణమురళి తన కొత్త సినిమాపై చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. ప్రధానంగా రాజకీయాల్లో ప్రవేశించి ప్రత్యర్థులకు టార్గెట్ గా మారిన పోసాని మారిన రాజకీయ పరిణామాలతో తనను సినిమా చేసుకోనివ్వండని, రోడ్డుపై పడేయొద్దని సరదాగా చేసిన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. గత ఏడాది ఫిబ్రవరిలో జైలుకు వెళ్లి వచ్చిన పోసాని కృష్ణమురళి పవర్ ఫుల్ లేడీ ఓరియెంటెడ్ సినిమా తీస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఆయన చేసిన వ్యాఖ్యలు ఇంట్రెస్టింగ్ చర్చకు తెరలేపాయి. "చాలా కాలం తర్వాత సినిమా చేసుకుంటున్నాను అబ్బా.. నన్ను రోడ్డుపై పడేయొద్దు అబ్బా" అంటూ వ్యాఖ్యానించిన పోసాని కొంచెం క్షమించాలని ఎమోషనల్ రిక్వెస్ట్ చేశారు. తన సినిమాకు రాజకీయాలతో సంబంధం లేదని క్లారిటీ ఇస్తూనే రోడ్డుపై పడేయొద్దని రాజకీయ ప్రత్యర్థులను విన్నవించుకున్నారు. నవ్వుతూ మాట్లాడుతూనే ప్రత్యర్థులను ప్రసన్నం చేసుకునేలా పోసాని వ్యాఖ్యలు ఉన్నాయంటున్నారు. ప్రజాసేవలో ఉండాలంటే సేవ చేయలి, జైలుకు వెళ్లాలి అని చెప్పిన పోసాని తాను జైలుకు వెళ్లిన ఉదంతాన్ని మరోసారి గుర్తు చేశారు. వైసీపీ తరఫున క్రియాశీలంగా పనిచేసిన పోసాని కృష్ణమురళి 2025 ఫిబ్రవరిలో అరెస్టు అయిన విషయం తెలిసిందే. నమోదు అవగా, గుంటూరు జైలులో 25 రోజుల పాటు రిమాండ్ ఖైదీగా ఉండాల్సివచ్చింది. జైలు నుంచి బెయిలుపై బయటకు వచ్చిన తర్వాత రాజకీయాలకు దూరంగా ఉంటానని చెప్పిన పోసాని, మళ్లీ మెగాఫోన్ పట్టుకుంటున్నట్లు గత జూన్‌లో ప్రకటించారు.

## ఎక్కడ ఎలా ఉండాలో తెలియాలి

టాలీవుడ్ యంగ్ హీరోయిన్ పాయల్ రాధాకృష్ణ చేసిన కొన్ని వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారాయి. ఈ బ్యూటీ తరగతి గది దాటి వెబ్ సిరీస్ ద్వారా పాపులర్ అయ్యారు. తాజాగా 'పాపం ప్రతాప్' ప్రమోషన్లలో తన మనసులోని మాటను బయటపెట్టింది. ముఖ్యంగా మహిళల స్వేచ్ఛ, అర్ధరాత్రి తిరగడం, వస్త్రధారణపై ఆమె చెప్పిన విషయాలు అందరినీ ఆశ్చర్యపరుస్తున్నాయి. ఏ ప్రదేశానికి వెళ్ళేటప్పుడు ఎలాంటి బట్టలు వేసుకోవాలి అనేది ఒక బాధ్యత అని ఆమె పేర్కొంది. ముఖ్యంగా గుడికి వెళ్ళేటప్పుడు తగిన విధంగా డ్రెస్ వేసుకోకపోతే అసలు తాను లోపలికే వెళ్లనని, అది తన క్రమశిక్షణ అని చెప్పుకొచ్చింది. ప్రతి అమ్మాయికి ఏ చోట ఎలా ఉండాలో తెలిసి ఉండాలని ఆమె సూచించింది. ఇక సాధారణంగా సమాజంలో పురుషులకు ఉన్న స్వేచ్ఛ తమకు ఎందుకు లేదు అని చాలా మంది మహిళలు ప్రశ్నిస్తుంటారు. దీనిపై పాయల్ స్పందిస్తూ.. 'మగవారు అర్ధరాత్రి బయట తిరుగుతారు, తాగుతారు.. కాబట్టి మేము కూడా అలాగే చేస్తాం అనడం కేవలం మూర్ఖత్వం అవుతుంది' అని ఘాటుగా వ్యాఖ్యానించింది. అంటే మంచి పౌరుడిగా ఉండటం అంటే సమాజంలో మన ప్రవర్తన బాధ్యతాయుతంగా ఉండాలని ఆమె వివరించింది.



## బాలయ్య సినిమాలో నర్గీస్ ఫక్రీ



నటసింహం నందమూరి బాలకృష్ణ, దర్శకుడు గోపీచంద్ మలినేని కాంబినేషన్ లో తెరకెక్కుతున్న భారీ యాక్షన్ ఎంటర్టైనర్ ఎన్‌బీకె111పై ఇప్పటికే ఆడియన్స్ లో భారీ అంచనాలు నెలకొన్నాయి. వీర సింహారెడ్డి తర్వాత ఆ ఇద్దరి కాంబో మళ్లీ రిపీట్ అవుతుండటంతో ప్రతి అప్డేట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. తాజాగా ఆ సినిమాకు సంబంధించిన స్పెషల్ సాంగ్ వార్త ఇప్పుడు నందమూరి అభిమానుల్లో మరింత హైప్ పెంచుతోంది. చిత్రంలో ఓ మాస్ స్పెషల్ సాంగ్ కోసం బాలీవుడ్ నటి నర్గీస్ ఫక్రీని తీసుకున్నట్లు సమాచారం. రాక్ స్టార్ సినిమాతో పాన్ ఇండియా రేంజ్ లో మంచి గుర్తింపు తెచ్చుకున్న నర్గీస్, ఇటీవల పవన్ కళ్యాణ్ నటించిన హరిహర వీరమల్లు మూవీలో కూడా కనిపించారు. ఇప్పుడు బాలయ్య సరసన ఐటెం సాంగ్ చేయడానికి సిద్ధమవడం ఆసక్తికరంగా మారింది. సమాచారం ప్రకారం, ఆ స్పెషల్ సాంగ్ షూటింగ్ ను హైదరాబాద్ లో ప్రత్యేకంగా వేసిన భారీ సెట్ లో మే 8 నుంచి ప్రారంభించనున్నారట. బాలయ్య మాస్ స్టెప్పులు, నర్గీస్ ఫక్రీ గ్లామర్ కలిస్తే ఆ పాట థియేటర్లలో అభిమానులకు పూనకాలు తెప్పించడం ఖాయమనే టాక్ వినిపిస్తోంది. ముఖ్యంగా బాలకృష్ణ సినిమాల్లో స్పెషల్ సాంగ్స్ కు ఎప్పుడూ ప్రత్యేకమైన క్రేజ్ ఉండటంతో ఆ పాటపై కూడా భారీ అంచనాలు ఏర్పడ్డాయి.

## కొత్త రికార్డుపై రష్మిక టార్గెట్



పెళ్లి తర్వాత రష్మిక నటిస్తోన్న మొదటి బాలీవుడ్ చిత్రం కాక్‌టెయిల్ 2. ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. జూన్ 19న విడుదలవుతున్న ఈ సినిమాతో రష్మిక హిందీ ప్రేక్షకులను ఏ మేరకు మెప్పిస్తుందో? అన్నది ఆసక్తికరంగా మారింది. గతంలో దీపికా పదుకొనేకు మంచి బ్రేక్ ఇచ్చిన కాక్టెయిల్ ఫ్రాంచైజీలో రష్మిక భాగం కావడం ఆమె కెరీర్‌కు ప్లస్ పాయింట్ గా మారుతుంది. నయనతార పెళ్లి తర్వాత షారుఖ్ ఖాన్ సరసన నటించి(జవాన్) సెన్సేషన్ సృష్టించినట్లుగానే రష్మిక కూడా ఈ సీక్వెల్‌లో షాహిద్ కపూర్, కృతి సనన్ వంటి స్టార్లతో స్క్రీన్ షేర్ చేసుకుంటుంది. పెళ్లి అనేది ఒక నటి సృజనాత్మకతకు అడ్డంకి కాదని నిరూపించడానికి ఆమె ఈ ప్రాజెక్టును ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. బాలీవుడ్ మేకర్స్ కూడా రష్మికలోని టాలెంట్‌ను గుర్తించి ఆమెకు వైవిధ్యమైన పాత్రలను ఆఫర్ చేస్తున్నారు. కాక్టెయిల్ 2 చిత్రంలో రష్మిక పాత్ర ఎంతో గ్లామరస్‌గా, ఎమోషనల్‌గా ఉండబోతోందని సమాచారం. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్లు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. పెళ్లి తర్వాత ఆమెలో వచ్చిన ఆ కొత్త వెలుగు , పరిణతి వెండితెరపై మ్యాజిక్ చేస్తుందని అభిమానులు ఆశిస్తున్నారు. ఈ సినిమా హిట్టయితే? పెళ్లి తర్వాత కూడా బాలీవుడ్‌లో అత్యధిక రెమ్యూనరేషన్ అందుకునే సౌత్ హీరోయిన్ల జాబితాలో ఆమె అగ్రస్థానానికి చేరుకుంటుంది. టాలీవుడ్, కోలీవుడ్‌లో సత్తా చాటిన రష్మికకు హిందీలో నిలదొక్కుకోవడం అత్యంత ముఖ్యం. పుష్ప 2 సక్సెస్ ఎలాగూ ఆమె వెంటే ఉన్నా? సోలో బాలీవుడ్ హిట్ ఆమె ఇమేజ్‌ను గ్లోబల్ స్థాయికి తీసుకెళ్తుంది.



## 'ఏక్ దిన్'కు నేను సూటవ్వలేదు: సాయిపల్లవి

దక్షిణాది సినిమాల్లో సాయిపల్లవి స్థాయి ఏంటో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. హీరో ఎవరైనా సరే.. కేవలం ఆమెను చూడ్డానికి పెద్ద ఎత్తున ప్రేక్షకులు థియేటర్లకు వస్తారు. సాయిపల్లవి నటించే లేడీ ఓరియెంటెడ్ సినిమాలకు కూడా మంచి ఆదరణ ఉంటుంది. కానీ బాలీవుడ్ అరంగేట్రంలో మాత్రం సాయిపల్లవికి చేదు అనుభవం తప్పలేదు. ఆమిర్ ఖాన్ తనయుడు జునైద్ ఖాన్‌తో కలిసి సాయిపల్లవి నటించిన 'ఏక్ దిన్' సినిమా ప్రేక్షకాదరణ పొందలేకపోతోంది. విడుదలకు ముందు ఈ సినిమాకు బజ్ క్రియేట్ కాలేదు. అడ్వాన్స్ బుకింగ్స్ మరీ దారుణంగా జరిగాయి. సినిమాకు టాక్ పర్వాలేదనిపించినా సరే.. జనం థియేటర్లకు రాలేదు. వీకెండ్లోనే ప్రభావం చూపలేకపోయిన 'ఏక్ దిన్'.. ఆ తర్వాత మరింత డౌన్ అయింది. గత కొన్నేళ్లలో బాలీవుడ్లో వచ్చిన కాస్త పేరున్న చిత్రాల్లో ఇది అతి పెద్ద డిజాస్టర్లలో ఒకటిగా నిలిచే సంకేతాలు కనిపిస్తున్నాయి. ఐతే ఇంకా 'ఏక్ దిన్' సినిమాను ప్రమోట్ చేస్తున్న సాయిపల్లవి.. ఈ సినిమాలో హీరోయిన్ పాత్ర తాను చేయకుండా ఉండాల్సిందని ఒక ఇంటర్వ్యూలో అభిప్రాయపడడం గమనార్హం. నిజానికి తాను ఎక్కువగా సీరియస్ పాత్రలు, వేదనకు గురయ్యే పాత్రలు చేసిన నేపథ్యంలో జాలీగా సాగే పాత్రలు చేయాలని ఎదురు చూస్తున్న సమయంలో.. మళ్లీ అలాంటి బాధ పెట్టే పాత్రే చేయాల్సి వచ్చిందని ఆమె చెప్పింది.



## తొలి పేసర్‌గా భువీ కొత్త రికార్డు

ఐపీఎల్ 2026 సీజన్‌లో సూపర్ ఫామ్ కనబరుస్తున్న రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) స్టార్ బౌలర్ భువనేశ్వర్ కుమార్ లక్నోతో మ్యాచ్‌లో అరుదైన రికార్డు సాధించాడు. లక్నో సూపర్‌జెయింట్స్‌తో మ్యాచ్ భువనేశ్వర్‌కు 200వ మ్యాచ్ కావడం విశేషం. ఐపీఎల్లో ఈ ఘనత సాధించిన తొలి పేసర్‌గా భువనేశ్వర్ అరుదైన రికార్డు సాధించాడు. ఓవరాల్‌గా ఐపీఎల్‌లో 200 మ్యాచ్‌లు ఆడిన ఆటగాళ్ల జాబితాలో భువనేశ్వర్ కుమార్ 12వ స్థానంలో ఉన్నాడు. అయితే ఈ 12 మంది భారత ఆటగాళ్లే కావడం ఇక్కడ చెప్పుకోదగ్గ విషయం. ఇక భువనేశ్వర్ కుమార్ ఇప్పటివరకు ఐపీఎల్‌లో 199 మ్యాచ్‌ల్లో 215 వికెట్లు పడగొట్టాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో ఆర్సీబీ తరఫున 10 మ్యాచ్‌ల్లో 17 వికెట్లు తీసి పర్పుల్ క్యాప్ రేసులో లీడింగ్‌లో ఉన్నాడు. 2011లో ఐపీఎల్‌లో అరంగేట్రం చేసిన భువనేశ్వర్ తొలుత పుణే వారియర్స్ (2011-2013 వరకు) 26 మ్యాచ్‌లు, ఎస్ఆర్‌హెచ్ (2014-2024 వరకు) 129 మ్యాచ్‌లు, ఆర్సీబీ (2025 నుంచి) 44 మ్యాచ్‌లు ఆడాడు.



## ముంబై పగ్గాలు మళ్లీ రోహిత్‌కే?

ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్‌ను విజయవంతమైన జట్టుగా తీర్చిదిద్దిన సారథి రోహిత్ శర్మ. ఎంఐని ఐదుసార్లు విజేతగా నిలిపాడు. అయితే, ముంబై ఫ్రాంచైజీ 2024 సీజన్‌లో రోహిత్‌ను సారథిగా తప్పించి హార్దిక్ పాండ్యాకు కెప్టెన్సీ అప్పగించిన విషయం తెలిసిందే. అయితే, ఈ నెల 10న రాయ్‌పూర్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరుతో జరిగే మ్యాచ్‌లో రోహిత్‌ను మళ్లీ ఎంఐ కెప్టెన్‌గాచ చూసే అవకాశాలు ఎక్కువే. ప్రస్తుత కెప్టెన్ హార్దిక్ పాండ్యా గాయంతో ఇబ్బందిపడుతున్నాడు. వెన్ను నొప్పితో ఇటీవల లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌కు దూరమయ్యాడు. వారం రోజులు అతన్ని విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు చూసినట్టు తెలిసింది. ముంబై ప్లేయర్లు బుధవారమే రాయ్‌పూర్‌కు చేరుకోగా, అందులో పాండ్యా లేడు. దీంతో ఆర్సీబీతో మ్యాచ్‌కు కూడా అతను అందుబాటులో ఉంటాడా? అంటే డౌటే. మరోవైపు, లక్నోతో మ్యాచ్‌లో పాండ్యా గైర్హాజరీలో సూర్య జట్టుకు నాయకత్వం వహించాడు. గురువారం అతని భార్య కూతురికి జన్మనిచ్చిన నేపథ్యంలో సూర్య కూడా ఆర్సీబీతో గేము ఆడతాడా? అన్న అనుమానాలు నెలకొన్నాయి. ఒకవేళ పాండ్యా, సూర్య ఆ మ్యాచ్‌కు అందుబాటులోకి రాకపోతే ముంబై ఫ్రాంచైజీ రోహిత్‌కు కెప్టెన్సీ పగ్గాలు అప్పగించే అవకాశం ఉందని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అదే జరిగితే హిట్‌మ్యాన్ అభిమానులే కాదు ఎంఐ ఫ్యాన్స్ కూడా ఫుల్ ఖుషీలో ఉంటారు.





# లక్కీ లక్నో

## ఎట్టకేలకు ఓ గెలుపు

### ఉత్కంఠ పోరులో ఆర్సీబీపై విన్.. మిచెల్ మార్ష్ ధనాధన్ సెంచరీ.. తోడుగా పూరన్, పంత్ దూకుడు

**ఐపీఎల్ 2026 సీజన్‌లో లక్నో సూపర్ జెయింట్స్ ఎట్టకేలకు తమ పరాజయాల పరంపరకు బ్రేక్ వేసింది. వరుసగా 6 పరాజయాల తర్వాత విజయాన్ని అందుకుంది. గురువారం లక్నో వేదికగా జరిగిన మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన లక్నో సూపర్ జెయింట్స్ డీఎల్ఎస్ పద్ధతిన 9 పరుగుల తేడాతో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ)ని ఓడించింది.**

ఆఖరి ఓవర్ వరకు ఉత్కంఠగా సాగిన ఈ మ్యాచ్ అభిమానులను ఉక్కిరి బిక్కిరి చేసింది. పదే పదే వర్షం అంతరాయం కలిగించిన ఈ మ్యాచ్‌ను అంపైర్లు 19 ఓవర్లకు కుదించగా.. ముందుగా బ్యాటింగ్ చేసిన లక్నో సూపర్ జెయింట్స్ 3 వికెట్లకు 209 పరుగులు చేసింది.



**ఐపీఎల్ 2026 పాయింట్ల పట్టిక**

| జట్టు | ఆ | గె | ఓ | పా |
|---|---|---|---|---|
| హైదరాబాద్ | 11 | 7 | 4 | 14 |
| పంజాబ్ | 10 | 6 | 3 | 13 |
| బెంగళూరు | 10 | 6 | 4 | 12 |
| రాజస్థాన్ | 10 | 6 | 4 | 12 |
| గుజరాత్ | 10 | 6 | 4 | 12 |
| చెన్నై | 10 | 5 | 5 | 10 |
| ఢిల్లీ | 10 | 4 | 6 | 8 |
| కోల్‌కతా | 9 | 3 | 5 | 7 |
| ముంబై | 10 | 3 | 7 | 6 |
| లక్నో | 10 | 3 | 7 | 6 |

ఆ-ఆడినవి గె-గెలిచినవి ఓ-ఓడినవి పా-పాయింట్లు

మిచెల్ మార్ష్(56 బంతుల్లో 9 ఫోర్లు, 9 సిక్స్‌లతో 111) సెంచరీతో చెలరేగగా.. నికోలస్ పూరన్(23 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 38), రిషభ్ పంత్(10 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లతో 32 నాటౌట్) దూకుడుగా ఆడారు. ఆర్సీబీ బౌలర్లలో జోష్ హజెల్‌వుడ్, కృనాల్ పాండ్యా, రసిక్ సలామ్ తలో వికెట్ తీసారు. అయితే డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం ఆర్సీబీ లక్ష్యాన్ని 19 ఓవర్లలో 213 పరుగులుగా నిర్ణయించారు. అనంతరం ఆర్సీబీ నిర్ణీత 19 ఓవర్లలో 6 వికెట్లకు 203 పరుగులే చేసి ఓటమిపాలైంది. రజత్ పాటిదార్(31 బంతుల్లో 3 ఫోర్లు, 6 సిక్స్‌లతో 61), దేవదత్ పడిక్కల్(25 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 34), టీమ్ డేవిడ్(17 బంతుల్లో4 ఫోర్లు, 3 సిక్స్‌లతో 40), కృనాల్ పాండ్యా(28 నాటౌట్), రొమారియో షెపెర్డ్(23) రాణించినా ఫలితం లేకపోయింది. లక్నో బౌలర్లలో ప్రిన్స్ యాదవ్(3/33) మూడు వికెట్లు తీయగా.. షెహ్‌బాజ్ అహ్మద్ రెండు వికెట్లు పడగొట్టాడు. మహమ్మద్ షమీకి ఒక వికెట్ దక్కింది.



## ప్యాట్ కమిన్స్‌కు సీఏ జాక్‌పాట్

ఆస్ట్రేలియా క్రికెట్ బోర్డు తమ జట్టు కెప్టెన్ ప్యాట్ కమిన్స్‌కు ఏడాదికి సుమారు 22 కోట్ల రూపాయల భారీ కాంట్రాక్టును ఆఫర్ చేసింది. ఐపీఎల్ వంటి ఫ్రాంచైజీ లీగ్‌ల వైపు వెళ్లకుండా అడ్డుకోవడమే ఈ భారీ ఆఫర్ వెనుక ఉన్న ముఖ్య ఉద్దేశ్యం. ఒకవేళ ఈ ఒప్పందం కుదిరితే 2029 వరకు కమిన్స్ మొత్తం 66 కోట్ల రూపాయల వరకు సంపాదిస్తారు. రాబోయే ఏడాదిలో ఆస్ట్రేలియా ఏకంగా 21 టెస్ట్ మ్యాచ్‌లు ఆడాల్సి ఉన్నందున కమిన్స్‌పై పెరిగే భారాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ డీల్‌ను ప్రతిపాదించారు. ప్రస్తుతం ఐపీఎల్ 2026లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు కమిన్స్ నాయకత్వం వహిస్తున్నారు. గత ఏడాది 18 కోట్ల రూపాయలకు కమిన్స్‌ను రిటైన్ చేసుకుంది వా=ఎ. అతని సారథ్యంలో సన్‌రైజర్స్ జట్టు 2024లో ఫైనల్‌కు చేరుకోవడమే కాకుండా ఈ ఏడాది కూడా పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో కొనసాగుతూ అద్భుతమైన ప్రదర్శన చేస్తోంది. క్రికెట్ ఆస్ట్రేలియాతో ఒకవేళ ఈ ఒప్పందం జరిగితే ప్యాట్ కమిన్స్ ఎన్ని మ్యాచ్‌లు ఆడినా లేకపోయినా ఆయనకు వచ్చే భారీ ఆదాయానికి ఎటువంటి డోకా ఉండదు. వెన్ను గాయం వల్ల ఈ సీజన్ ఐపీఎల్‌లో మొదటి ఏడు మ్యాచ్‌లకు దూరమైనా తిరిగి వచ్చాక ప్యాట్ కమిన్స్ బాల్‌తో అద్భుతంగా రాణిస్తున్నాడు. 32 ఏళ్ల ఈ ఫాస్ట్ బౌలర్ తన అద్భుతమైన ఫామ్‌తో ఆరెంజ్ ఆర్మీని విజయపథంలో నడిపిస్తున్నాడు. ముఖ్యంగా పవర్‌ప్లేలో బౌలింగ్ చేసే విధానం అందరినీ ఆకట్టుకుంటోంది. ఆడిన కేవలం నాలుగు మ్యాచ్‌ల్లోనే నాలుగు వికెట్లు తీసి జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. నిన్న పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో కమిన్స్ తన ప్రతాపం చూపించాడు. భారీ స్కోర్లు నమోదైన ఆ ఉత్కంఠ పోరులో కీలక వికెట్లు తీసి సన్‌రైజర్స్‌కు విజయాన్ని అందించాడు. తన అద్భుతమైన కెప్టెన్సీతో జట్టును నడిపించినందుకు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది.

## 'ప్రేయసి రావే' అంటే కుదరదు!

పంతొమ్మిదో సీజన్ ఐపీఎల్‌లో కొందరు భారత క్రికెటర్ల వ్యవహారం దుమారం రేపుతున్న విషయం తెలిసిందే. స్టేడియంలోనే కాకుండా.. టీమ్ బస చేసే హోటల్‌లోనూ హార్దిక్ పాండ్యా, ఇషాన్ కిషన్, యశస్వీ జైస్వాల్, అర్ష్‌దీప్ సింగ్ వంటివారు తమ ప్రియురాళ్లతో చెట్టాపట్టాలేసుకుని తిరుగడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తరచూ వీరు గర్ల్‌ఫ్రెండ్‌తో ఉండడం నెట్టింట సంచలనంగా మారింది. ఈ నేపథ్యంలో బీసీసీఐ కీలక నిర్ణయం తీసుకుంది. కుర్రాళ్లన్నాక ప్రేమలో పడడం మామూలే. కానీ, కొందరు భారత ఆటగాళ్లు మాత్రం హద్దులు దాటుతున్నారు. మా లవర్ మా ఇష్టం అనుకుంటున్నారేమో.. గోప్యత పాటించడం మాత్రం మరిచిపోతున్నారు. స్టేడియంలోకి సరే.. కానీ, ఏకంగా టీమ్ హోటల్‌లోనూ తమ ప్రియురాళ్లతో కనిపిస్తుండడంతో 'ఇదేం ఐపీఎల్‌రా నాయనా.. ఆట చూడాలా.. వీళ్ల అతి చేష్టలు చూడాలా' అని మండిపడుతున్నారు. మరీ ముఖ్యంగా పాండ్యా తన గర్ల్‌ఫ్రెండ్ మహీకా శర్మతో నానా రచ్చ చేస్తున్నాడు.



## సీనియర్లలో గంభీర్‌పై అసంతృప్తి!



టీమిండియా ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్‌పై భారత మాజీ క్రికెటర్ అతుల్ వస్సన్ సంచలన ఆరోపణలు చేశాడు. గంభీర్ దూకుడు స్వభావం, అతడి కఠిన వైఖరితో జట్టులోని కొంతమంది ఆటగాళ్లు అసంతృప్తితో రగిలిపోతున్నారని పేర్కొన్నాడు. అయితే వస్సన్ ఆ ఆటగాళ్ల పేర్లను వెల్లడించడానికి నిరాకరించాడు. అతుల్ వస్సన్ మాట్లాడుతూ.. 'గంభీర్ చిన్నప్పటి నుంచి నాకు బాగా తెలుసు. గంభీర్ ఎప్పుడూ తాను చెప్పిందే జరగాలి, ఇంకేమీ చేయకూడదు అన్నట్లుగా వ్యవహరిస్తుంటాడు. మొదటి నుంచి గంభీర్ స్వభావం అలాగే ఉంటుంది. ధనిక కుటుంబం నుంచి వచ్చినప్పటికీ గంభీర్ ఆటలో మంచి టెక్నిక్ ఉండడంతో పాటు మంచి తెలివిమంతుడు. అయితే అతనికి ఉండే ఈగో వేరే లెవెల్‌లో ఉంటుంది. అదెలా అంటే అతను ఏదైనా అనుకుంటే అవతలి వ్యక్తుల కూడా తనకు మద్దతు ఇవ్వాల్సిందే అన్నంత కఠినంగా ఉండేవాడు. ఆ కఠినత్వం క్రికెట్ నుంచి రిటైర్ అయ్యాకా కూడా గంభీర్‌లో అలాగే కొనసాగడం ఆటగాళ్లతో గొడవలు పడేలా చేసింది. అందుకే ఐపీఎల్‌లో కోహ్లీతో ఢీ అంటే ఢీ అన్నాడు. ఇక భారత జట్టుకు ప్రధాన కోచ్‌గా గంభీర్ బాధ్యతలు తీసుకున్న తర్వాత అతడి కఠినత్వ వైఖరి పట్ల టీమిండియా డ్రెస్సింగ్ రూమ్‌లో కొంతమంది ఆటగాళ్లు అసంతృప్తితోనే ఉన్నారు. వారి పేర్లు చెప్పడం నాకిష్టం లేదు. కానీ వాళ్లు మాత్రం గంభీర్ ప్రవర్తనతో కచ్చితంగా సంతోషంగా లేరని చెప్పగలను'అని చెప్పుకొచ్చాడు. ఇక టీమిండియా తరఫున అతుల్ వస్సన్ 4 టెస్టు మ్యాచ్‌ల్లో 10 వికెట్లు, 9 వన్డేల్లో 11 వికెట్లు పడగొట్టాడు.

## తండ్రైన సూర్యాభాయ్



భారత టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ మొదటిసారి తండ్రయ్యాడు. అతడి భార్య దేవిశ శెట్టి పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఇటీవల బేబీబంప్‌తో కనిపించిన .. గురువారం బిడ్డను కన్నది. ఈ విషయాన్ని మా ఇంట్లోకి చిన్నారి ఏంజెల్ వచ్చింది అనే పోస్ట్‌తో సూర్య అభిమానులకు తెలియజేశాడు. టీమిండియా స్టార్, టీ20ల్లో సంచలన బ్యాటరైన సూర్యకుమార్ యాదవ్ తండ్రిగా ప్రమోట్ అయ్యాడు. 2016లో దేవికను పెళ్లాడిన సూర్య.. తొలిసారి ఫాదర్ క్లబ్‌లో చేరాడు. తమ ఇంట్లోకి ఓ దేవత వచ్చిందని అతడు సోషల్ మీడియా వేదికగా వెల్లడించాడు. 'ముసిముసి నవ్వులు, కలలు నిజమైన వేల.. మేము చిన్నారి పాపకు తల్లిదండ్రులమయ్యాం' అని తమ బిడ్డ చేతిని పట్టుకున్న ఫొటోతో సూర్య పోస్ట్ పెట్టాడు. అతడి పోస్ట్ చూసినవాళ్లంతా మిస్టర్ 360 జీవితంలో కొత్త ఇన్నింగ్స్ మొదలైందని అభినందనలు చెబుతున్నారు. అయితే.. పెళ్లైన పదేళ్లకు సూర్య, దేవిశ జంట ముగ్గురవ్వడంతో వారి కుటుంబసభ్యుల సంతోషానికి, ముంబై ఇండియన్స్ అభిమానుల సంతోషానికి అవధులు లేవు.

## దేవజిత్ సైకియా ఆకస్మిక రాజీనామా

బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా కీలక నిర్ణయం తీసుకున్నారు. అసోం రాష్ట్ర అడ్వకేట్ జనరల్ పదవికి ఆకస్మికంగా రాజీనామా చేశారు. ఈ విషయాన్ని స్వయంగా సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. అసోం ముఖ్యమంత్రి హేమంత బిస్వ శర్మ ప్రభుత్వంలో దాదాపు ఐదేళ్ల పాటు అడ్వకేట్ జనరల్‌గా సేవలందించిన దేవజిత్ సైకియా.. రాజ్యాంగ సంప్రదాయాలను గౌరవిస్తూ పదవి నుంచి వైదొలుగుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పదవీకాలం ముగియడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. క్రికెట్‌తో పాటు న్యాయరంగంలోనూ సైకియా ప్రత్యేక గుర్తింపు పొందారు. అసోంకు చెందిన ఆయన గతంలో రాష్ట్ర రంజీ జట్టుకు వికెట్‌కీపర్, మిడిలార్డర్ బ్యాటర్‌గా సేవలందించారు. అనంతరం న్యాయవాద వృత్తిలోకి అడుగుపెట్టి గౌహతి హైకోర్టులో ప్రాక్టీస్ ప్రారంభించారు. 2021లో అసోం రాష్ట్రంలోనే అత్యంత పిన్న వయస్కుడైన అడ్వకేట్ జనరల్‌గా బాధ్యతలు స్వీకరించారు.

ఈవార్తలు
# ప్రజావాణి
శుక్రవారం 8-5-2026, జగిత్యాల
www.evarthalu.com
నేటి ఈవార్తలు


నేటి ఈవార్తలు | సంపాదకీయం | Editorial

# తలసేమియా.. జాగ్రత్త తప్పనిసరి

తలసేమియా రక్తానికి సంబంధించిన ఒక తీవ్రమైన వంశపారంపర్య వ్యాధి. శరీరంలో హిమోగ్లోబిన్ ఉత్పత్తి తగినంతగా జరగకపోవడం వల్ల ఈ వ్యాధి సంభవిస్తుంది, దీని ఫలితంగా రోగి తీవ్రమైన రక్తహీనతకు లోనవుతారు. ప్రపంచ వ్యాప్తంగా కోట్ల మంది ఈ వ్యాధితో పోరాడుతుండగా, భారతదేశంలోనూ దీని ప్రభావం గణనీయంగా ఉంది. ఈ నేపథ్యంలో, తలసేమియా పట్ల సమాజంలో అవగాహన పెంచడం, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం నేటి అవసరం. తలసేమియా బారిన పడిన శిశువుల్లో సాధారణంగా 3 నుండి 18 నెలల వయస్సులోనే లక్షణాలు బయటపడతాయి. చర్మం పాలిపోవడం, ముఖం పీక్కుపోయినట్లు అవ్వడం, శారీరక ఎదుగుదల లేకపోవడం, తరచుగా అనారోగ్యానికి గురికావడం వంటి లక్షణాలు ఉంటాయి. వ్యాధి తీవ్రతను బట్టి రోగులకు ప్రతి 15 నుండి 20 రోజులకు ఒకసారి రక్తమార్పిడి చేయాల్సి ఉంటుంది. అయితే, నిరంతరం రక్తాన్ని ఎక్కించడం వల్ల శరీరంలో ఐరన్ (ఇనుము) శాతం పెరిగి ఇతర అవయవాలకు ప్రమాదం వాటిల్లే అవకాశం ఉంది. తలసేమియాను నివారించడం లేదా దానితో జీవించడంలో సరైన జాగ్రత్తలు కీలక పాత్ర పోషిస్తాయి తలసేమియాను అరికట్టడానికి అత్యంత ముఖ్యమైన మార్గం వివాహానికి ముందు దంపతులు హెచ్‌బీఏ2 వంటి రక్త పరీక్షలు చేయించుకోవడం. తల్లిదండ్రులిద్దరూ తలసేమియా మైనర్ (క్యారియర్లు) అయితే, పుట్టబోయే బిడ్డకు తలసేమియా మేజర్ వచ్చే అవకాశం 25% ఉంటుంది. గర్భం దాల్చిన తర్వాత తొలినాళ్లలోనే తలసేమియా పరీక్షలు చేయించుకోవడం ద్వారా బిడ్డ ఆరోగ్య స్థితిని తెలుసుకోవచ్చు. ప్రస్తుతం ఎముక మజ్జ మార్పిడి వంటి ఆధునిక చికిత్సల ద్వారా ఈ వ్యాధిని నయం చేసే అవకాశం ఉంది. మేనరికం వల్ల కూడా ఈ వ్యాధి వచ్చే అవకాశం ఉంది, కాబట్టి వంశ చరిత్రను గమనించడం ముఖ్యం. ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు ఇప్పటికే ఉచిత రక్త పరీక్షలు, మందుల పంపిణీ ద్వారా బాధితులను ఆదుకుంటున్నాయి. అయినప్పటికీ, ప్రజల్లో చైతన్యం రానంత కాలం ఈ వ్యాధిని పూర్తిగా నిర్మూలించడం కష్టం. పెళ్లికి ముందు జాతకాల కంటే ఆరోగ్య పరీక్షలకే ప్రాధాన్యతనిచ్చినప్పుడే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించగలం.

## మానవతా గుండెను తాకుదాం

ఎన్ని త్యాగాల చరణాలు పల్లవిస్తే
మనదేశ విముక్తి గీతాన్ని ఆలపించగలిగినం

ఎంతమంది వీరుల అమరత్వం జ్వలిస్తే
స్వచ్ఛా దీపాలను వెలిగించుకోగలిగినం

ఎన్నికోట్ల గొంతులు ధిక్కార స్వరాల్ని పూరిస్తే
బానిస సంకెళ్లను ఛేదించగలిగినం

ఎన్నెన్ని పిడికిళ్లు ఉద్యమానికి ఊపిరిలూదితే
పరాయి పాలనను కూకటివేళ్లతో కూల్చగలిగినం

ఎన్ని ఊపిరిలు ఉరితాళ్లను ముద్దాడితే
మువ్వెన్నెల జెండాను ఎదకద్దుకోగలిగినం

భిన్నత్వంలో ఏకత్వాన్ని పండించుకుని
సమైక్య రాగాల్ని గుండెనిండా ఆలపించుకుంటున్నం

కులమతాలు వేరైనా త్రివేణి సంగమమై దేశమంతా
ఒకే జాతిగా మనగలుగుతున్నాం

అలాంటి నా భారతీయ ఆత్మను మలినం చేస్తూ మత విద్వేషాలు
మారణహోమాలు సృష్టించేదొకడు

లౌకికత్వానికి మతం రంగేసి సమానత్వానికి దేశభక్తి ముసుగేసి
దేశ సమైఖ్యతను బుల్డోజర్లతో కూల్చేదొకడు

శాంతి సౌభాగ్యాలను సమాధి చేసి సంక్షేమాన్ని పాతరేసి
తిరోగమిస్తున్న అభివృద్ధిని డబుల్ ఇంజినని భ్రమింప జేసేదొకడు

నరనరాల్లో పేరుకు పోయిన విద్వేషపు బీజాల్ని నాటేందుకు
రాజ్యాంగాన్ని మారుస్తాననేదొకడు

గుళ్లు గోపురాలు దేవుళ్ల పేరుతో సమాజాన్ని భక్తి మత్తులో ముంచి
రాజకీయాలకు మతం రంగు పులుముతాడొకడు

చేతకాని చేవలేనితనాన్ని కప్పిపుచ్చుకునేందుకు మనుషుల మధ్య
విభజన రేఖను గీస్తుంటే చేష్టలుడిగి చూద్దామా?

పడావు పడ్డ మన మెదళ్లకు 5 .జీని కనెక్ట్ చేసి
రేపటితరం భవిష్యత్తును సెర్చ్ చేద్దాం రండి

మతాన్ని మనిషిలోకి ఎక్కించడం మాని
సమానత్వాన్ని కౌగిలించుకుందాం

కులమతాల కంచెలను కూల్చేసి
మనిషి గుండెను ఒకసారి తాకి చూద్దాం రండి



**మధుకర్ వైద్యుల**
జర్నలిస్ట్. కవి, రచయిత, 8096677409

# భావోద్వేగాల అక్షర ముద్ర...
# తొలి సంతకం



**రమాదేవి కులకర్ణి**
ఇంగ్లీష్ లాంగ్వేజ్ ట్రైనర్, రైటర్
మోటివేషనల్ స్పీకర్, హైదరాబాద్
8985613123


సాహిత్యం అనేది కేవలం పదాల సమాహారం కాదు; అది ఒక మనసు తనను తాను ప్రపంచానికి పరిచయం చేసుకునే పవిత్ర ప్రక్రియ. ప్రతి కవిత ఒక భావోద్వేగపు ప్రతిధ్వని, ప్రతి పదం ఒక అంతరంగపు స్పందన, ప్రతి అక్షరం ఒక జీవనానుభవపు ముద్ర. అలాంటి ఆత్మీయత, అలాంటి నిజాయితీ, అలాంటి అంతర్ముఖతతో రూపుదిద్దుకున్న కవితా సంపుటి 'తొలి సంతకం.' ఈ శీర్షికలోనే ఒక ప్రత్యేకమైన సంకేతార్థం దాగి ఉంది. 'సంతకం' అనేది ఒక వ్యక్తిత్వానికి ప్రతీక, ఒక స్వీయ గుర్తింపుకు చిహ్నం, ఒక అస్తిత్వానికి ధృవీకరణ. ఆ దృష్టిలో చూస్తే, ఈ కవితా సంపుటి కేవలం కవయిత్రి రచనా ప్రారంభం మాత్రమే కాదు, ఆమె అంతరంగ ప్రపంచం తనను తాను అక్షరాల రూపంలో ఆవిష్కరించుకున్న తొలి సాక్ష్యం. ఈ సంపుటిలోని కవితలు కేవలం ఊహాజనితమైన భావ చిత్రాలు కావు; అవి జీవితం అనే విస్తృత అనుభవ సముద్రం నుంచి ఉద్భవించిన మౌన తరంగాలు. కుటుంబ బంధాలు, తల్లిదండ్రుల త్యాగం, స్త్రీ అంతరంగ సంఘర్షణలు, సమాజంలోని విలువలు, కాలచక్రం అనివార్య గమనము, విశ్వంతో మనిషి అనుసంధానం వంటి విభిన్న అంశాలను కవయిత్రి తన సున్నితమైన భావప్రపంచం ద్వారా ఆవిష్కరించింది. ఈ కవితల్లో కనిపించే భాష సరళమైనదైనా, దాని వెనుక దాగి ఉన్న భావాల లోతు అత్యంత గంభీరమైనది. కవయిత్రి తన అనుభవాలను కేవలం వ్యక్తీకరించలేదు; వాటిని పాఠకుని అనుభూతిగా మార్చగలిగింది. ప్రతి కవిత ఒక అద్దంలా నిలబడి, పాఠకుని తనలోని సత్యాన్ని దర్శించుకునేలా చేస్తుంది. ూార్ ష్ట్రవ జుఅస్త్రశ్రీఅంష్ట్ర శ్రీఖ్‌వతీఖతీఎ ఖఎఱఅస్త్ర స్త్రశీవం,ూా జూశీవఎ ఎవస్త్రఱఅం ఱఅ ఒవశ్రీఅస్త్రష్ట్ర ఖఱఅ వఱఅం ఱఅ ఒఱంఒశీఎ. ఈ సంపుటిలోని ప్రతి కవిత కూడా పాఠకుని మనసులో ఒక అనుభూతితో ప్రారంభమై, ఒక ఆలోచనతో ముగుస్తుంది. అందువల్ల 'తొలి సంతకం' అనేది కేవలం ఒక కవితా సంకలనం కాదు; అది ఒక ఆత్మ తనను తాను అర్థం చేసుకునే ప్రయత్నం, ఒక వ్యక్తిత్వం తన అస్తిత్వాన్ని అక్షరాల్లో శాశ్వతంగా ముద్రించుకునే మహత్తర సాహిత్య ప్రయాణం.

'తొలి సంతకం' కవితా సంపుటి మొత్తం 63 కవితలు ఉన్నాయి, అవి చదివినప్పుడు, ఇది ఒక సాధారణ కవితల సమాహారం కాదని స్పష్టంగా అర్థమవుతుంది. కవయిత్రి విశ్వైక తన జీవితాన్ని, తన అనుభవాలను, తన అనుబంధాలను, తను సమాజాన్ని అర్థం చేసుకునే ఒక అంతర్ముఖ ప్రయాణం. ఈ కవితల్లో కవయిత్రి ఎంచుకున్న వస్తువు (ష్ట్రవఎవ) చాలా విస్తృతమైనది. అనేక కవితలు కుటుంబ బంధాలపై కేంద్రీకృతమై ఉన్నాయి. ముఖ్యంగా 'అమ్మ,' 'నాన్న,' 'నా బాల్యం' వంటి కవితలు చదివినప్పుడు, కవయిత్రి తన వ్యక్తిగత అనుభవాలను ఎంతో సహజంగా వ్యక్తపరచినట్లు తెలుస్తుంది. ఈ కవితల్లో ఎక్కడా కృత్రిమత కనిపించదు. ప్రతి భావం సహజంగా, ప్రతి పంక్తి నిజాయితీగా ఉంటుంది. తల్లి ప్రేమను, తండ్రి రక్షణను, బాల్యంలోని అమాయకత్వాన్ని కవయిత్రి ఎంతో సున్నితంగా చిత్రించారు. ఈ కవితలు చదివినప్పుడు, పాఠకుడు తన జీవితంలోని అనుభవాలను గుర్తు చేసుకుంటాడు. ఇదే నిజమైన కవిత్వం లక్షణం.

As the English saying goes,
True poetry touches the heart before it reaches the mind.

ఇందులోని మరొక ముఖ్యమైన అంశం సామాజిక చైతన్యం. విశ్వైక తన కవితల ద్వారా సమాజంలోని అనేక సమస్యలను ప్రస్తావించారు. ముఖ్యంగా స్త్రీ స్థానం, రైతు జీవితం, దేశభక్తి వంటి అంశాలు ఈ కవితల్లో ప్రతిబింబిస్తాయి. స్త్రీ జీవితం గురించి రాసిన కవితల్లో, ఆమె స్త్రీ భావోద్వేగాలను మాత్రమే కాకుండా, ఆమె ఎదుర్కొనే సామాజిక ఒత్తిడులను కూడా వ్యక్తపరచారు. ఈ కవితలు ఒక స్త్రీ అంతరంగ సంఘర్షణను మాత్రమే కాదు, ఆమె ఆత్మగౌరవాన్ని కూడా ప్రతిబింబిస్తాయి. అదే విధంగా రైతు జీవితం గురించి రాసిన కవితల్లో, కవయిత్రి రైతు కష్టాన్ని, అతని సహనాన్ని, అతని గొప్పతనాన్ని గుర్తు చేశారు. ఈ కవితలు సమాజంలో రైతు ప్రాముఖ్యతను పాఠకునికి గుర్తు చేస్తాయి.అన్నపూర్ణ వారసుడు అంటూ... రైతన్నను అభివర్ణించిన కవిత 'సూర్యుడు అతని కోసం నిరీక్షిస్తుంటాడు... -సమయపాలనకు నియమబద్ధుడైన అతని రాకతో తన గమనాన్ని సరిపోల్చుకోవడానికి ఆకాశం అతడికి సలాము చేస్తుంది... రంగులేని తమ వాన బిడ్డకు అద్భుతంగా హరిత వర్ణమద్దాడని, భూదేవి అతడి అడుగులకోసం ఆశగా చూస్తుంది.. అతడు నడియాడే చోట తన ఖనిజ సంపద సారవం తమవుతుందని, నీటిప్రవాహం అతని పాదాలకు వందనం చేస్తుంది... అతని చేతులలోకి చేరితే తన జన్మకు సార్థకత చేకూరుస్తాడని, గాలి అతడికి ప్రణమిల్లుతుంది.. తన పయనానికి స్వచ్ఛమైన పంటచేల సుగంధాన్ని బహుమతిగా అందిస్తాడని' ఇలా అద్భుతమైన ప్రతీకలతో సాగింది ఈ కవిత.

దేశభక్తి అంశం కూడా ఈ సంకలనంలో ఒక ముఖ్యమైన స్థానం పొందింది. దేశం కోసం ప్రాణత్యాగం చేసే సైనికుల గురించి రాసిన కవితలు చదివినప్పుడు, కవయిత్రి దేశం పట్ల ఉన్న గౌరవం స్పష్టంగా కనిపిస్తుంది. ఈ కవితలు కేవలం భావోద్వేగాలను వ్యక్తపరచడం మాత్రమే కాదు; అవి పాఠకునిలో దేశభక్తిని మేల్కొలుపుతాయి. As the English proverb says, Freedom is never free. ఈ భావం ఈ కవితల్లో స్పష్టంగా ప్రతిఫలిస్తుంది. భాషా పరంగా పరిశీలిస్తే, ఈ కవితా సంపుటి ప్రధాన బలం సరళత. కవయిత్రి ఎక్కడా క్లిష్టమైన పదజాలాన్ని ఉపయోగించలేదు. ఆమె ఉపయోగించిన భాష సాధారణమైనదైనా, దాని వెనుక ఉన్న భావాలు చాలా లోతైనవి. ఈ సరళత వల్లే ఈ కవితలు ప్రతి పాఠకునికి అర్థమవుతాయి. అదే సమయంలో, ఈ సరళతలోనే ఒక ప్రత్యేకమైన అందం ఉంది. Simplicity is the ultimate sophistication. ఈ కవితల్లో కథన శైలి కూడా ప్రత్యేకంగా ఉంది. చాలా కవితలు ఒక కథలా సాగుతాయి. 'అమ్మా.. నువ్వు నీలావుండు ఉద్యోగం చేద్దామంటే
పిల్లలతో కుదరలేదు పోనీ ఇంట్లోనే ఉండి ఏదైనా చేద్దామన్నా వీలుపడలేదు నువ్వు అమ్మవి పిల్లలను నువ్వు చూసుకోకపోతే ఎలా? నువ్వు అమ్మవి నీ ఇష్టం వచ్చినట్లు నువ్వు ఉంటే ఎలా? అమ్మకు చిన్నప్పటి నుంచి కొన్ని నియమాలు పెట్టేసాం....!' ఇలా. ప్రతి కవితలో ఒక ప్రారంభం, ఒక భావ వికాసం, ఒక తాత్విక ముగింపు కనిపిస్తుంది. ఈ విధానం వల్ల పాఠకుడు కవితను చదవడమే కాకుండా, దాన్ని అనుభవిస్తాడు. కవయిత్రి తన భావాలను కేవలం వ్యక్తపరచలేదు, వాటిని పాఠకుని అనుభూతిగా మార్చగలిగింది. ఇది ఒక గొప్ప కవయిత్రి లక్షణం. ఇందులోని కవితలు చదివినప్పుడు, కవయిత్రి వ్యక్తిత్వం కూడా స్పష్టంగా కనిపిస్తుంది. ఆమె ఒక సున్నితమైన హృదయాన్ని కలిగిన వ్యక్తి మాత్రమే కాదు, ఒక సామాజిక బాధ్యతను గుర్తించిన వ్యక్తి కూడా! ఆమె తన అనుభవాలను కేవలం తనలోనే పరిమితం చేయలేదు; వాటిని సమాజంతో పంచుకున్నారు. ఇది ఒక నిజమైన రచయిత లక్షణం. ూా షతీఖ్‌వతీ ఱం ంశీఎవశీఅవ ష్ట్రశీ ంవవం ఎవవజూవతీ ్ష్ఘుఅ శ్రీష్ట్రవతీం. ఈ కవితా సంపుటి మొత్తం ఒక భావోద్వేగ ప్రయాణంలా ఉంది. ఇది పాఠకుని మనసును తాకుతుంది, ఆలోచింపజేస్తుంది, అతనిలో ఒక కొత్త అవగాహనను సృష్టిస్తుంది. ఈ కవితలు చదివిన తర్వాత, పాఠకుడు తన జీవితాన్ని, తన సంబంధాలను, తన బాధ్యతలను ఒక కొత్త దృష్టితో చూడటం ప్రారంభిస్తాడు. ఇదే ఒక గొప్ప కవితా సంపుటి లక్షణం. కన్నీటిని, మెరుపుచుక్క అంటారు ఈవిడ! 'కంటిలోన మెరుపు చుక్క కంటి గుట్టు దాచలేక కంటి గట్టు దాటలేక కన్నీటిలో కాగుతోంది ఆవిరిలా మారుతోంది.. ఎండిన దారపు దారులలో ఎండమావులెతుకుతోంది. పంచన వంచన ఉన్నా సహనంతో సాగుతోంది. ఓపిక దాటిన బతుకు ఉరికొయ్యకు ఊగుతోంది...!'




మొత్తానికి 'తొలి సంతకం' కవితా సంపుటి ఒక అంతరంగ ప్రయాణానికి, ఒక సున్నిత మనసు విశ్వాన్ని గ్రహించే విధానానికి, ఒక వ్యక్తి జీవితానుభవాల ఆత్మీయ ప్రతిబింబానికి ప్రతీకగా నిలుస్తుంది! ఈ సంపుటిలోని ప్రతి కవిత ఒక భావాన్ని మాత్రమే కాకుండా ఒక విలువను, ఒక సందేశాన్ని, ఒక అనుభూతిని పాఠకుని హృదయంలో నాటుతుంది. బాల్యంలోని అమాయకత్వం నుంచి వృద్ధాప్యంలోని నిశ్శబ్దం వరకు, కుటుంబ బంధాల సాన్నిహిత్యం నుంచి సమాజంలోని అసమానతల వరకు, వ్యక్తిగత ఆవేదన నుంచి విశ్వ చైతన్యం వరకు విస్తరించిన భావ పరిధి ఈ కవితలకు ప్రత్యేకతను అందిస్తుంది. కవయిత్రి పదాల్ని కేవలం వాక్యాలుగా ఉపయోగించలేదు; వాటిని జీవితం స్పందనగా మలిచింది. Poetry is when an emotion has found its thought and the thought has found words. ఈ మాటలకు సజీవ ఉదాహరణగా ఈ కవితా సంపుటి నిలుస్తుంది. ప్రతి కవిత పాఠకుడిని తనలోకి ఒకసారి చూసుకునేలా చేస్తుంది, తన సంబంధాలను, తన బాధ్యతలను, తన విలువలను పునర్విమర్శించుకునేలా ప్రేరేపిస్తుంది. అందువల్ల 'తొలి సంతకం' అనేది కేవలం కవయిత్రి తొలి సంతకం మాత్రమే కాదు, ఆమె ఆత్మ తొలి స్పష్టమైన వ్యక్తీకరణ, ఆమె భావ ప్రపంచానికి ఒక శాశ్వత చిరునామా, తెలుగు సాహిత్యంలో ఒక భావోద్వేగపూరిత, సార్థకమైన ప్రవేశంగా చిరస్థాయిగా నిలిచే కృతి అని నిర్ధారంగా చెప్పవచ్చు.

## రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.